మీనం.. బలం...





- పెరుగుతున్న చేపల వినియోగం
- జిల్లాలో ఏటా 2500 టన్నుల చేపల ఉత్పత్తి
- జిల్లాలో 14 మత్స్యకార సంఘాలు..
- చేపల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గతంలో ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చినపుడో..? పండుగలు, పబ్బాలకు మాంసాహారం వండేవాళ్లు. అయితే మారుతున్న కాలాన్ని బట్టి.. ఇప్పుడు రోజూ ఇంట్లో ఒక పూటైనా ముక్కలేనిదే ముద్ద దిగబడని స్థాయికి సమాజం చేరుకుంటోందని చెప్పవచ్చు. పొట్టేలు, మేక మాంసంతో పాటు చికెన్ వినియోగం ఎక్కువగా ఉంది. అయితే ఆరోగ్య రీత్యా మటన్, చికెన్‌ను వాడడానికి ఇష్టపడని వాళ్లు ప్రత్యామ్నాయంగా చేపలను ఎక్కువగా వాడుతున్నారు. దీంతో చేపల వినియోగం పెరుగుతూ వస్తోంది. దీనికి తగ్గట్లుగా జిల్లా అధికార యంత్రాంగం కూడా జిల్లాలో చేపల పెంపకానికి పెద్దపీట వేస్తోంది. ప్రభుత్వం సైతం చేపల పెంపకానికి మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. రిజర్వాయర్లు, చెరువుల్లో లక్ష లాది చేప పిల్లలను వదులుతున్నారు. ఇవి పెరిగి పెద్దవి కాగానే మత్స్యకారులు పట్టుకుని..అమ్మి జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏడాది నవంబరు 21న ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని జరుపుకుంటారు.



వెలిగల్లు వద్ద చేపలు అమ్ముతున్న మత్స్యకారులు

148 చెరువులు, రెండు రిజర్వాయర్లు

జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 148 చిన్న నీటి పారుదలశాఖ చెరువులు, రెండు రిజర్వాయర్లలో 14,274 హెక్టార్లలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేపలను పెంచుతున్నారు. చెరువులు, రిజర్వాయర్లలో ప్రతి ఏడాది నవంబరులో లక్షలాది చేప పిల్లలను మత్స్యశాఖ విడిచిపెడుతోంది. గాలివీడు మండలంలోని వెలిగల్లు రిజర్వాయర్, నందలూరు మండలంలోని సోమశిల బ్యాక్‌వాటర్‌లో 16 లక్షల చేప పిల్లలను విడిచిపెడతారు. వెలిగల్లు ప్రాజెక్టులో చేపల పెంపకం మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతోంది. గత ఏడాది నవంబరులో 4.8 లక్షల చేప పిల్లలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టులోకి వదిలారు. ఈ ఏడాది ఇంకా విడిచిపెట్టలేదు. నిమ్మనపల్లె మండలం బాహుదా నది, అహోబిలం చెరువులో గత నెల 10 లక్షల చేప పిల్లలను వదిలారు. సబ్సిడీతో చేపపిల్లలను గత ఏడాది మత్స్యకార సంఘాలకు ప్రభుత్వం అందచేసింది. ముఖ్యంగా ఇక్కడ రోహు, కట్లు, ఎర్ర మోసు వంటి రకాలను వదులుతారు. ఇవి సంవత్సరానికి 6 నుంచి 8 కేజీల వరకు పెరుగుతాయి. ఇవేకాక పింఛా, ఝరికోన ప్రాజెక్టులల్లోనూ చేప పిల్లలను వదులుతున్నారు. మత్స్యశాఖ సమాచారం ప్రకారం సాధారణంగా జిల్లాలో కట్ల, రోహు, మృగాల, జిలేబి, బంగారుతీగ, కొర్రమీను రకపు చేపలు పెంచుతున్నారు.



రాయచోటిలో చేపలు అమ్ముతున్న వ్యాపారులు

ఏటా 2500 టన్నుల ఉత్పత్తి

జిల్లాలో ఏటా సుమారు 2500 టన్నులు చేపల ఉత్పత్తి జరుగుతోంది. సాధారణంగా నవంబరులో చేప పిల్లలను విడిచిపెట్టినా మూడు, నాలుగు నెలల్లోనే.. ఆరు కిలోలకు పైగా వాటి బరువు పెరుగుతుండటంతో వాటిని పట్టుకుని అమ్ముతారు. అయితే జూలై, ఆగస్టులలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ఆ సమయంలో చేపల వేట నిలిపివేస్తారు. సంవత్సరానికి సుమారు ఆరు నెలలు చేపల వేట జరుగుతుంది. జిల్లాలోని మత్స్యకారులు చెరువులు, రిజర్వాయర్ల నుంచి లభ్యమవుతున్న చేపలను అధికశాతం జిల్లాతో పాటు పక్క జిల్లాల్లోని పెద్దపెద్ద పట్టణాలలో అమ్మకాలు చేస్తుంటారు. జిల్లాలో మత్స్యకారులు ఎక్కువగా చెరువులు, రిజర్వాయర్లలో చేపల వేట పై ఆధారపడతారు. 2025-26 సంవత్సరానికి, జిల్లాలోని అన్ని చెరువులు, రిజర్వాయర్లలో నవంబరు వరకు చేపల ఉత్పత్తి 2072 టన్నులుగా ఉంది. జిల్లాలో 14 మత్స్యకార సహకార సంఘాలు ఉండగా 405 మంది చేపల వేట లైసెన్స్ ఉన్న మత్స్యకారులు ఉన్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలోని వెలిగల్లు రిజర్వాయర్‌తో పాటు మరే ఇతర చెరువుల్లోనూ చేపలు పట్టుకోవడానికి వేలం వేయలేదు. ఎవరికి తోచినట్లు వాళ్లు పట్టుకుని అమ్ముకుంటూ ఉన్నారు. ప్రస్తుతం అనేక జబ్బులు ఉన్న రోగులకు వైద్యులు ఎక్కువగా మాంసం, చికెన్ తినడం కంటే.. చేపలు మేలని సూచిస్తుండటంతో క్రమక్రమంగా చేపల వినియోగం పెరుగుతూ వస్తోంది.

నిమ్మనపల్లెలోని చెరువులో చేపలను వదులుతున్న అధికారులు





కిలో టమోటా రూ.54

- ఒక్కసారిగా పెరిగిన ధర



గుర్రంకొండ మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

గుర్రంకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో గురువారం కిలో టమోటా ధర రూ.54 పలికింది. బయట రాష్ట్రాల్లో టమోటాల దిగుబడి తగ్గడం, వర్షాలకు తోటలు దెబ్బతిని దిగుబడి తక్కువగా రావడంతో ఒక్కసారిగా ధర పెరిగింది. గుర్రంకొండ మార్కెట్ యార్డులో 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.1350 పలికింది. టమోటా ధరలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఆర్ఎం



నందలూరు రైల్వే కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎం

నందలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రాన్ని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన రైల్వేస్టేషన్ త్రిబుల్ సీ కార్యాలయం, పార్కు, ఇన్‌స్టిట్యూట్, జిమ్, రీడింగ్ రూములను పరిశీలించారు. నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, రైల్వే విశ్రాంత ఉద్యోగి కమాల్‌బాషా, ఆర్యవైశ్య సంఘ నేతలు యంబలూరు నరసింహ, మేడా వెంకటకుమార్, గెలివి శివశంకర్ డీఆర్ఎంను కలిసి హైదరాబాదు, చెన్నై వెళ్లే రైళ్లకు నందలూరులో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన డీఆర్ఎం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట డీఈఎన్ (సౌత్) సుదర్శన్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్ కమలాకర్, ఆర్పీఎఫ్ ఎస్ఐ త్రివేణి, సీఎల్ఐ పెంచలయ్య, సీసీసీ విశ్వనాథ్, చీఫ్ ఆఫీసు సూపరింటెండెంట్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

- హౌసింగ్ పీడీ రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రమేశ్

నిమ్మనపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన పీఎం ఆవాస్ యోజన పథకం కింద సిబ్బంది స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు లేని వారిని గుర్తించి వారితో దరఖాస్తు చేయించాలని తెలిపారు. ఇంటి స్థలం లేని పేదలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాగా ఇప్పటికే 828 మంది లబ్ధిదారులు నమోదు చేసుకోగా వారిలో 756 మందికి ఇంటి స్థలం ఉండగా, 72 మంది స్థలం లేని వారు ఉన్నట్లు తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ కచ్చితంగా గ్రామాల్లో పర్యటించి మరింతమంది లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈ దీనదయాల్ రాజ్, ఏఈ అమరనాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి

- డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమరనాథరెడ్డి

మదనపల్లె టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుధ్యం, పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఉదయమే గ్రామాల్లో తిరిగితే పారిశుధ్య పనులు పర్యవేక్షించడంతో పాటు, స్వామిత్వ సర్వే, ఇంటిపన్నుల వసూలు ఒకేసారి చేయొచ్చన్నారు. సర్పంచ్‌లు కూడా ఈ తరహాలోనే ప్రజలకు అవగాహన కల్పించి పారిశుధ్య పనులు నిర్వహిస్తే ప్రజల ఆరోగ్యం కాపాడిన వారవుతారన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులు, పన్నేతర వసూళ్లను స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారానే కార్యదర్శులు వసూలు చేయాలని తెలిపారు. మాన్యువల్‌గా, ఇతర పద్ధతిలో వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, డిప్యూటీ ఎంపీడీవో భారతి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారానే జరగాలి

- డీపీవో రాధమ్మ

6

వీరభద్రాలయంలో వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గురువారం అమావాస్య పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్యస్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ అమ్మవారు, వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం పల్లకీపై మాడవీధుల్లో ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానికులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఘనంగా ఏక్తా దివస్ ర్యాలీ



కడప నగరంలో చేపట్టిన ఏక్తాదివస్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, బీజేపీ నేతలు

కడప మారుతీనగర్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం కడపలో ఏక్తాదివస్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖల సంయుక్త ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్‌లో తొలుత ప్రత్యేక సభా కార్యక్రమం నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఇందులో మై భారత్ తరపున గ్రామాలలో సేవలందించే యువజన సంఘాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. తదుపరి కలెక్టరేట్ నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల అంబేడ్కర్ సర్కిల్ వరకూ ఏక్తా దివస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో అటు కేంద్రంలో నరేంద్రమోదీ, ఇటు రాష్ట్రంలో కూటమి సర్కార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలన సాగిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ 18 నెలల పాలన దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే కూడా బాగుందన్నారు.

జగన్‌రెడ్డి చేసిన పాపాలు కేసుల రూపంలో పండుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ మీడియా ప్యానలిస్ట్ బాలకృష్ణయాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, శివానాయక్, జనసేన నాయకులు రమణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, కార్యదర్శి చాగల మర్రి ఓబులేసు, మైభారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పె(పే)ద్దాసుపత్రి

- పారిశుధ్య చర్యలు అంతంతే...
- మహిళలు, గర్భిణీలకు సౌకర్యాలు నిల్
- పట్టించుకోని వైద్య శాఖాధికారులు
- ఇదీ రాయచోటి ఆస్పత్రి తీరు

6

సమస్యల పరిష్కారానికే అదాలత్: ఎస్ఈ

జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా ప్రేమంతకుమార్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా ప్రేమంత కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్య దర్శి కోనశశిధర్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న అదనపు ప్రాజె క్టు కోఆర్డినేటర్లకు ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు చేపట్టింది. ఇందులో భా గంగా నంద్యాల జిల్లా సమగ్రశిక్ష ఏపీసీగా విధులు నిర్వహిస్తున్న నిత్యానంద రాజును కడప జిల్లాకు బదిలీ చేసింది.

ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి

- ఒక్కదానికీ సరైన సమాధానం చెప్పని జెన్‌కో అధికారులు
- పలు విషయాలపై అండర్ టేకింగ్ కమిటీ ఆగ్రహం



ఆర్టీపీపీ అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేల కమిటీ

ఎర్రగుంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో అసెంబ్లీ ఫైనాన్స్ అండర్ టేకింగ్ కమిటీ వేసిన ప్రశ్నలకు ఏపీజెన్‌కో, ఆర్టీపీపీ అధికారులు సమాధానాలు చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గురువారం పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, ఎమ్మెల్సీ బి.రామగోపాల్‌రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే టి.శ్రవణ్‌కుమార్, పామూరు ఎమ్మెల్యే వి.కుమార్‌రాజాలతో కూడిన కమిటీ గురువారం ఆర్టీపీపీ ప్లాంటును పరిశీలించింది. అనంతరం ఆర్టీపీపీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జెన్‌కో డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, సీఈ జీఎం వాసుదేవరావు, ఇతర అధికారులతో కమిటీ సుమారు మూడు గంటల పాటు సమీక్షించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సంధించిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలారు. అడిగిన ఏ ప్రశ్నకు సరైనా సమాధానం ఇవ్వకపోవడంతో కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 5 ఏళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను కమిటీ అడిగింది. అయితే కేవలం ఒక్క సంవత్సరం వివరాలు మాత్రమే కొంత ఇచ్చారు. ఆర్టీపీపీలో ఉన్న ప్లాంట్లలో కొన్ని బాగా నడుస్తుండగా, మరి కొన్ని ప్లాంట్లు తరచూ ఎందుకు బ్రేక్ డౌన్ అవుతున్నాయని నిలదీశారు. అన్ని యూనిట్లకు ఒకేరకమైన బొగ్గు, ఉద్యోగులు ఉండగా ఎందుకింత వ్యత్యాసం ఉందని ప్రశ్నించారు. ఫ్లైయాష్ అమ్మడం ద్వారా వచ్చిన రూ.850కోట్లు ఇప్పటి వరకు అకౌంట్లో ఎందుకు జమచేయలేదని నిలదీశారు. క్రిష్ణపట్నం నుంచి 39 మందిని ఇక్కడికెందుకు తీసుకొచ్చారు..

ఇక్కడి వారికి ఎందుకు ప్రమోషన్స్ ఇవ్వలేదని ప్రశ్నించారు. అమరావతికి పిలుస్తాం, మొత్తం వివరాలతో రావాలన్నారు. ఎర్రగుంట్ల మండలంతోపాటు ప్రొద్దుటూరు వరకు ఇంత కాలుష్యం ఉంటే ఏంచేస్తున్నారని ప్రశ్నించింది. భూ నిర్వాసితులకు గ్రీవెన్స్ నిర్వహించి ఎందుకు ఉద్యోగాలివ్వలేదని అడిగింది. కాలుష్యం నివారణకు సీఎస్ఆర్ నిధులు ఎందుకు సక్రమంగా సద్వినియోగం చేయలేదని నిలదీసింది. అండర్‌టేకింగ్ కమిటీ వేసిన ఏ ప్రశ్నలకు ఆర్టీపీపీ అధికారులు సమాధానం చెప్పలేక తెల్లముఖాలు వేశారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి

ఆర్టీపీపీలో అధికారులతో రివ్యూ అనంతరం కూన రవికుమార్ మాట్లాడుతూ.. ఆర్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీపీపీకి సరఫరా అయ్యే బొగ్గు మేలిరకం కాకపోవడంతో ప్లాంటులోని యూనిట్లు పూర్తిస్థాయిలో పీఎల్ఎఫ్‌ను సాధించలేక పోతున్నాయన్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయంపై జెన్‌కోతో పూర్తిస్థాయిలో చర్చలు జరిపిన తర్వాత అసెంబ్లీకి నివేదిక ఇస్తామన్నారు. అలాగే యాష్‌పాండ్‌లో సుమారు కోటి యాభై లక్షల మెట్రిక్ టన్నుల బూడిద ఉందన్నారు. దీన్ని భవిష్యత్తులో ఎన్‌హెచ్, గ్రామీణ రోడ్లకు ఇసుక బదులుగా నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీపీపీలో ఉద్యోగులకు సమస్యలు చాలా ఉన్నాయని వాటిపై జెన్‌కో సమీక్షలో చర్చిస్తామన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా పీడీ వెంకటరత్నం



నీలకంఠ్రావుపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలని, నాణ్యతగా పనులు చేపట్టాలన్నారు. మండల వ్యాప్తంగా 800 మంది కూలీలు పనిచేస్తున్నారన్నారు. నీలకంఠ్రావుపేట గ్రామంలో 120 మంది కూలీలు పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఆయన అదే గ్రామానికి చెందిన రైతు చిన్న వెంకటేశులుకు చెందిన మామిడి తోటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏ కళావతి, ఎఫ్ఏ పెంచల్‌రెడ్డి, ఆ గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా, నియాజ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22వ తేదీ గ్రామసభలు నిర్వహించినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22వ తేదీ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కార్మికులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు తెలియచేయాలన్నారు. కొత్త జాబ్‌కార్డులు నమోదు చేసుకునేందుకు, ఆధార్‌కు ఈకేవైసీ లింక్ చేయడం వంటి సమస్యలు ఏమైనా ఉంటే ఈ గ్రామసభల్లో తెలియజేయాలని సూచించారు.

ఉరేసుకుని చేనేత కార్మికుడు మృతి



మృతి చెందిన చేనేత కార్మికుడు

మదనపల్లె అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మోడెం శ్రీనివాసులు(48) ఉరేసుకుని బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... వీవర్స్ కాలనీ వాసి వెంకటస్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మోడెం సురేంద్ర ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. కాగా అన్నదమ్ములకు ఆరేళ్లగా భూ వివాదం నడుస్తోంది. పలు మార్లు పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పారని, కోర్టులో కేసులు వేసి భూములను బీడుగా ఉంచారు. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చాలా సార్లు ఈ విషయమై ఘర్షణ పడినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు మొదటి భార్య కవితకు ఇద్దరు కుమార్తెలు, రెండో భార్య ఆదిలక్ష్మికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆర్థిక వనరులు లేక కుటుంబం జీవనం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 9 గంటలకు మృతుడి అన్న మోడెం సురేంద్ర సీసీ ఫుటేజ్‌లతో కూడిన సాక్ష్యాలతో కేసు పెట్టి లోపల వేయిస్తానని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన మోడెం శ్రీనివాసులు ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పంచతో ఉరేసుకున్నాడు. ఉదయం నిద్రలేచి చూసిన భార్య కవిత కేకలు వేసింది. స్థానికులు వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోర్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని మొదటి భార్య కవిత ఫిర్యాదు మేరకు సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- బంగారు, వెండి, కాంస్య పతకాలు సొంతం



బంగారు, కాంస్య, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యకళ మందిర్‌లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వేకోడూరు పట్టణంలోని ఆదర్శ, నారాయణ, విక్టరీ, ఎస్‌కే స్పోర్ట్స్ అకాడమీలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు కోచ్ ఎస్‌కే మౌల గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.సుహిత, డి.సుప్రియలు బంగారు పతకాలు సాధించారన్నారు. డి.ధనుష్, టి.జయశంకర్, డి.మధీహ, బి.జయదేవ్‌లు కాంస్య పతకాలు, సులేమాన్, ఈ. చందన, డి.హేవనిక, యం.లేహ్యాలు వెండి పతకాలను సాధించినట్లు వివరించారు. విద్యార్థిని, విద్యార్థులకు తమ అకాడమీలో మంచి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి

రాయచోటిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షలు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఏపీ స్టేట్ బీసీ స్టడీ సర్కిల్ విజయవాడ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ఆర్.నాగేంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని గొల్లపూడిలో గల ఏపీ స్టేట్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిసెంబరు 10 నుంచి జరగనున్న సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం ప్రస్తుతం సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న బీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు డిసెంబరు 5న స్ర్కీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఈ టెస్ట్‌లో అర్హత పొందిన వారికి డిసెంబరు 10 నుంచి ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం ఉంటుందని, వివరాలకు 7989819470, 967668175 లను సంప్రదించాలన్నారు.

రసవత్తరంగా అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు



గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు రసవత్తరంగా పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్లో జరిగాయి. ఇందులో బాల బాలికల జట్లు ప్రతిభ కనబర్చినట్లు ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు డాక్టర్ ఎస్‌బాబు, శారద, ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీధర్ తెలిపారు. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న బాలికల జట్లు అనంతపురం, నెల్లూరు, వెస్ట్‌గోదావరి, విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి, కడప, చిత్తూరు, శ్రీకాకుళం, బాలుర జట్లు ఈస్ట్, వెస్ట్ గోదావరి, చిత్తూరు, నెల్లూరు, కర్నూల్, కడప, వైజాగ్, అనంతపురం, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ పాల్, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజా, ఝాన్సీరాణి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేశ్, దిలీప్, కిరణ్, మహేంద్రనాయక్, బాలాజీ, అన్సర్, కమలేశ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే అదాలత్: ఎస్ఈ



వినియోగదారుల సమస్యలు వింటున్న ట్రాన్స్‌కో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి

ములకలచెరువు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందిచడమే లక్ష్యమన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. మదనపల్లె పట్టణం, రూరల్, తంబళ్లపల్లె, ములకలచెరువు సబ్ డివిజన్ల వినియోగదారులు రాతపూర్వకంగా అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్ సాంకేతిక సభ్యులు శ్రీనివాసబాబు, ఈఈ గంగాధరం, ఏఈ శేషు తదితరులు పాల్గొన్నారు.

పె(పే)ద్దాసుపత్రి

- పారిశుధ్య చర్యలు అంతంత మాత్రమే
- ప్రహరీగోడ నిర్మాణం జరిగేనా ?
- మహిళలు, గర్భిణీలకు సౌకర్యాలు నిల్
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



రాయచోటి ఏరియా ఆసుపత్రి భవనం

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అది.. లక్షకు పైగా జనాభా కలిగిన జిల్లా కేంద్రం. ఇక్కడ వున్న రాయచోటి ఏరియా ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రి వుండగా, వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. గత ప్రభుత్వంలో నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. ఇక్కడికి రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు కలికిరి, కలకడ, కేవీపల్లి, సుండుపల్లె, వీరబల్లి, గుర్రకొండ, పెద్దమండెం, ఎన్‌పీకుంట, చక్రాయపేట తదితర మండలాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. ప్రతిరోజు 800 నుంచి 900 వరకు ఓపీ నడుస్తున్నట్లు ఆసుపత్రి రికార్డులు చెబుతున్నాయి. పేరుకే వంద పడకల ఆసుపత్రి అయినప్పటికీ ఇక్కడ ఆ స్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో నేటికీ ఎమర్జెన్సీ కేసులను కడప, తిరుపతి ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. మెరుగైన కార్పొరేట్ వైద్యం పొందలేని పేదలు ఎందరో రాయచోటి ఏరియా ఆసుపత్రికి వస్తుంటారు. అయితే రోగులు ఆశించినంత స్థాయిలో వైద్య సేవలు లేకపోవడంతో ఇది పెద్దాసుపత్రా ? లేక పేదాసుపత్రా అని ఎద్దేవా చేస్తున్నారు.



ముమ్మరంగా జరుగుతున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు

సమయపాలన పాటించని వైద్యులు

గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాయచోటి పట్టణంలో 50 పడకల ఆసుపత్రిగా ఉన్న సమయంలో వైద్యులు పనితీరు ఎలా ఉందో నేడు జిల్లా కేంద్రం అయినప్పటికీ, వంద పడకల ఆసుపత్రిగా మారినప్పటికీ వైద్యుల సమయపాలనలో మాత్రం ఎటువంటి మార్పు కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ఓపీలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది సెలవులో ఉన్న వైద్యుల పేర్లతో ఓపీ సిటీలను పంపుతూ వారు కూడా విధుల్లో ఉన్నట్లు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కంటి విభాగం వైద్యుడు బదిలీ అయినా ఆ స్థానంలో ఎవరిని నియమించకపోవడంతో ఎంతో మంది కంటి సమస్యతో బాధపడుతున్న రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఆర్థోపెడిక్ సేవలు కూడా పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఇక్కడ ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన చికిత్సల కోసం కడప, తిరుపతి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మహిళలకు ఇంజక్షన్లు, గర్భవతులకు స్కానింగ్ నిర్వహించే ప్రాంతాల్లో కేవలం తాత్కాలిక కర్టన్‌లు ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

శానిటేషన్ అంతంత మాత్రమే

రాయచోటి ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్ సమస్య అంతంత మాత్రంగానే ఉంది. ఆసుపత్రిలో సుమారు పది మందికి పైగా శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఆసుపత్రి ఆవరణంలో పరిశుభ్రత ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు గడ్డి పెరిగిపోయింది. ఆసుపత్రి ఆవరణంలో పలు రోగులు తిరిగే ప్రాంతాల్లో కొన్ని గదుల్లో సరైన శుభ్రత లేకపోవడంతో రాత్రి సమయాల్లో అక్కడే ఉంటున్న రోగులు ఆపరేషన్ అయిన వారు, డెలివరీ అయిన గర్భవతులు తదితరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆసుపత్రికి పడమర భాగంలో ఉన్న పాత ప్రహరీగోడ కూలిపోయి ఏడాది కావస్తున్నా ప్రహరీ గోడ నిర్మాణంలో అటు కాంట్రాక్టర్లు ఇటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో బయట వ్యక్తులతో పాటు పశువులు, కుక్కలు ఆసుపత్రి ఆవరణంలోకి వస్తున్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి కృషి

- డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటి ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో ఏరియా ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్లు పడమర వైపున ఉన్న పాత గోడ స్థానంలో నూతన ప్రహరీగోడ నిర్మించాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్లు అదనపు భారం పడుతుందన్న కారణంగా ప్రహరీగోడ నిర్మించకుండా వెళ్లిపోయారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా ప్రహరీ గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తాం.

ముమ్మరంగా క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు

ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ భవనం నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాయచోటి ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాల భారిన పడే బాధితులు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో సరైన వైద్యం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయానికి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో క్షతగాత్రుల సౌకర్యార్థం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృషితో రాయచోటి ఏరియా ఆసుపత్రి ఆవరణంలో 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను రూ.23 కోట్లతో వేగంగా చేపడుతున్నారు.



వైద్యుడు రాకపోవడంతో వైద్య సేవల కోసం వేచి ఉన్న రోగులు

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బాలరాజు

- రేపు రాజంపేటలో ప్రమాణ స్వీకారం



సమావేశంలో పాల్గొన్న డాక్టర్‌లు బాలరాజు, సుధాకర్, చెన్నయ్య, ఇతర వైద్యులు

రాజంపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజంపేట పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ బాలరాజు ఎన్నికయ్యారు. ఆయన ఈనెల 22వ తేదీ శనివారం రాజంపేటలోని తిరుమల కన్వెన్షన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు రాజంపేట ఐఎంఏ అసోసియేషన్ సీనియర్ వైద్యులు సుధాకర్, చెన్నయ్య, బాలరాజు తెలిపారు. గురువారం ఐఎంఏ సభాభవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బాలరాజు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రముఖ వైద్యులు హాజరవుతున్నట్లు తెలియజేశారు. రెండు రోజుల పాటు వైద్యులకు, విజ్ఞానానికి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రజలు ఈ రెండు రోజుల పాటు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేన్ వైద్యులు వీరయ్య, విజయ్‌కుమార్, శ్రీహరి, సునీల్, అనిల్, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సాహితిని అభినందిస్తున్న ఎస్ఎన్ శ్రీనివాసులు

రైల్వేకోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలకు రైల్వేకోడూరు ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థిని యు.సాహితి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు గురు వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థిని బేస్‌బాల్‌లో మంచి ప్రతిభను కనబరిచిందన్నారు. జనవరి మొదటి వారంలో ఢిల్లీ నిర్వహించే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎస్.వసుంధర, పీఈటీ పుల్లారావు తదితరులు విద్యార్థిని అభినందించారు.

మహిళ అదృశ్యం



రమాదేవి (ఫైల్)

రైల్వేకోడూరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లె గ్రామానికి చెందిన లక్కాకుల రమాదేవి (55) అనే మహిళ ఈ నెల 14న అదృశ్యమైందని ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆమె కోసం భర్త, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొంతకాలంగా ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. భర్త మణి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 9133011204, 9885202864కు సమాచారం అందించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ కోర్సుకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్స్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ కోర్సుకు డిసెంబరు 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి విసీల్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి పరిశ్రమ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఉచిత శిక్షణ ప్రధాన లక్ష్యమన్నారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. ఈనెల 30వ తేదీలోపు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8886297300 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

బద్వేలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిగా వెసులుబాటు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారికి టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారానే జరగాలి : డీపీఓ



వాల్మీకిపురంలో పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

వాల్మీకిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణపంచాయతీలో భాగంగా పన్నుల చెల్లింపులు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె వాల్మీకిపురం పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అధికారులు, సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. గ్రామ పంచాయతీలో బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయని ప్రశ్నిస్తూ ఈ నెల 30 నాటికి వందశాతం వసూళ్లు చేపట్టి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్యం తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సెక్రటరీలకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ఎక్కడా డ్రైనేజీల నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ఇంటి పన్ను చెల్లించవచ్చు



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

ఒంటిమిట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్‌తో ఇంటి పన్నులు చెల్లించవచ్చని ఎంపీడీవో సుజాతమ్మ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కోడ్ ద్వారా ఇంటి పన్ను, నీటి పన్ను, లైసెన్సు ఫీజులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అలాగే శుక్రవారం ఒంటిమిట్టలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట పంచాయతీ సెక్రటరీ సుధాకర్ పాల్గొన్నారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

రాయచోటిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల భూములకు రక్షణ కవచంగా ఉండే అసైన్డ్ చట్టాన్ని సవరించడం దుర్మార్గకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా అనేక ప్రభుత్వాలు నిరుపేదలకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను మంజూరు చేసిందని, ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా అమ్మడానికి, కొనడానికి వీలు లేకుండా 9/77 అసైన్డ్ చట్టాన్ని తీసుకువచ్చిందని, అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసి విఫలమైందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ రోజు వైసీపీ చర్యలను తప్పుబట్టి ఈ రోజు అసైన్డ్ చట్టాన్ని సవరణ చేసి పేదలు తమ భూములు అతి సునాయాసంగా కోల్పోయే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నెల 10న జరిగిన కేబినెట్ సమావేశంలో చేసిన అసైన్డ్ చట్టసవరణను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న స్థానిక ఎన్జీవో హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు, మేధావులు, అభ్యుదయ వాదులు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి సుధాకర్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర పోటీలకు కన్నెమడుగు విద్యార్థిని



విద్యార్థిని హేమలత

తంబళ్లపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు కన్నెమడుగు హైస్కూల్ విద్యార్థిని హేమలత ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాష తెలిపారు. ఈ నెల 7వ తేదీన మదనపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో హేమలత సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థిని 21, 22 తేదీల్లో మదనపల్లెలో గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. విద్యార్థినిని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసాపేట హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాల, దఫేదార్‌పల్లి ఉర్దూ హైస్కూల్, కొత్తపల్లి ఉర్దూ హైస్కూల్లో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించాలనుకుంటున్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షపై సాధ్యాసాధ్యాలను సమీక్షించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు మడితాటి నరసింహారెడ్డి, కొండూరు మురళీమోహన్‌రాజు, వెంకట్రామరాజు, నల్లమల రామాంజులు, వాలూనాయక్, గోవింద నాగరాజు, అమర్‌నాథ్, గౌనిపల్లి రెడ్డెన్న, నాగరాజునాయక్, బలరామరాజు, నరేంద్ర, శివరామరాజు, ఆసీఫ్, వెంకట్రమణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి డైట్ కేంద్రంలో సభ్యత్వ నమోదు చేస్తున్న నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు

ఉద్యాన పంటలకు డ్రిప్

- నీటి ఆదా.. దిగుబడులు అధికం
- అంతర పంటల సాగు లాభదాయకం

దువ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే నీటి ఆదాతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని ఉద్యావన శాఖకు సంబంధించిన అధికారులు సూచిస్తున్నారు. ఇక అంతర పంటల సాగు చేయడం ద్వారా చీడ పీడల నివారణతో పాటు మంచి ఆదాయం లభిస్తుంద ని చెబుతున్నారు. ఈ దిశగా పలువురు రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



పాతదువ్వూరులో తమలపాకు తోటకు ఏర్పాటు చేసిన డ్రిప్

దువ్వూరు మండలంలోని మూడిండ్లపల్లె, దువ్వూరు ప్రాంతంలో పసుపు పంట వేసిన కొందరు రైతులు డ్రిప్ ఏర్పాటు చేశారు. దీంతో తోటలు బాగా పెరిగి కళకళలాడుతున్నాయి. డ్రిప్ ద్వారానే తెగుళ్లను అదుపు చేసే కొన్ని కెమికల్స్‌తోపాటు సత్తువలను పంపుతున్నారు. మొక్కలకు నేరుగా ఇవి అందడంతో ప్రయోజనకరంగా ఉందని సంబంధిత రైతులు చెబుతున్నారు. మండలంలో ఈ తరహా డ్రిప్ ఏర్పాటుతో ఈశ్వర్‌రెడ్డి, షబ్బీర్ అనే రైతులు సాగు చేసిన పసుపు తోటలు కళకళలాడుతున్నాయి. అలాగే పసుపులో అంతర్ పంటగా బొప్పాయి వేశారు. ఈ తోటలు ఆశాజనకంగా కనపడుతున్నాయి. బొప్పాయి కాపునకు వస్తే మంచి ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. దీంతోపాటు పాత దువ్వూరు, రాంసాయి నగర్, మూడిండ్లపల్లె ప్రాంతాల్లో రామకృష్ణ, చలపతి, వెంకటేశ్వర రెడ్డి అనే రైతులు తమలపాకు తోటలకు డ్రిప్ పద్ధతి అవలంబిస్తున్నారు. తోటల్లో ఆకులు విరగ కాస్తున్నాయి. డ్రిప్ ఏర్పాటుకు ఉద్యానవన శాఖ ద్వారా పెద్ద మొత్తంలో సబ్సిడీ అందజేస్తుండడం విశేషం.

డ్రిప్ ఎంతో ఉపయోగకరం

ఉద్యాన వనశాఖకు సంబంధించిన పంటలకు డ్రిప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ద్వారా నీరు ఆదా అవుతుంది. ఎరువు మొక్కకు నేరుగా అందుతుంది. పసుపులో దుంపకుళ్ల రాకుండా తోడ్పడుతుంది. తమలపాకు తోటల్లో దిగుబడి పెరుగుతుంది. పసుపులో అంతర పంటగా బొప్పాయి సాగు చేస్తే తెగుళ్ల అదుపులో ఉండడంతోపాటు మంచి ఫలితాలు అందుతాయి.

- సి.రామకృష్ణ, ఉద్యానవనశాఖ అధికారి, మైదుకూరు.



పసుపులో అంతర పంటగా సాగు చేసిన బొప్పాయి

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డీబార్



పరీక్షలను తనిఖీ చేస్తున్న కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలను హైపర్ కమిటీ సభ్యులు అకస్మికంగా తనిఖీ చేశారు. రెండు కేంద్రాలలో ముగ్గురు విద్యార్థులను డీబార్ చేశారు. గురువారం ఉమ్మడి కడప జిల్లా వైవీయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు, హైపవర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ రియాజున్నీసా సుండుపల్లెలోని వీరభద్ర డిగ్రీ కళాశాలలో ఒకరిని డీబార్ చేయగా, పుల్లారెడ్డిపేట ఎస్‌ఎల్‌ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరిని ప్రొఫెసర్ కట్టా వెంకటేశ్వర్లు డీబార్ చేశారు. ఈ సందర్భంగా సీఈ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలలో 16887 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలకు అబ్జర్వర్లను పంపామని, హైపర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారన్నారు.

గండికోటను సందర్శించిన ఎమ్మెల్యేల కమిటీ

గండికోట లోయ వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు



జమ్మలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పబ్లిక్ అండర్ టేకింగ్ ఎమ్మెల్యేల కమిటీ సందర్శించింది. గురువారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, వర్ల కుమార్‌రాజా, ఆర్‌వీఎస్ కేకే, రంగారావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలు గండికోటను సందర్శించారు. వారి వెంట ఆర్డీవో సాయిశ్రీ, టూరిజం డివిజనల్ మేనేజర్ మల్లికార్జునగౌడ్, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి సిబ్బంది ఉన్నారు. మొదట రంగనాథ స్వామి దేవాలయం నుంచి లోయ వరకు వెళ్లి పరిశీలించారు. అక్కడి నుంచి ధాన్యాగారం వరకు వచ్చి చుట్టూ పరిసరాలు పరిశీలించారు. అలాగే హరిత హోటల్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు గండికోట కోటను నిర్మించిన రాజు, పరిసర ప్రాంతాల్లో తీసిన సినిమా షూటింగులపై చర్చించుకున్నారు. ఇక్కడ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, పర్యాటకులను ఆకట్టుకుంటోం దన్నారు. అనంతరం రాత్రి 6.52 గంటలకు అక్కడి నుంచి కమిటీ బయల్దేరి వెళ్లింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



పర్వీన్ మృతదేహం

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీ యూ క్వార్టర్స్‌లో పర్వీన్ (32) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... పర్వీన్ ఆమె భర్త టిప్పు సుల్తాన్ ఇరువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పర్వీన్ తన భర్తతో మనస్పర్థల కారణంగా బుధవారం హైదరాబాద్ నుంచి పులివెందుల జేఎన్టీయూ క్వార్టర్స్‌లో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. గురువారం మధ్యాహ్నం పర్వీన్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం



మహిళ ఒంటిపై లభ్యమైన వస్తువులు

చెన్నూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇర్కాన్ సర్కిల్ సమీపంలో కేసీ కెనాల్ బ్రిడ్జి కింద సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని మహిళ శవం గుర్తించినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఈ మహిళ చనిపోయి దాదాపు మూడు వారాలకుపైగా అయి ఉంటుందని, శరీరం గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉబ్బిపోయి ఉందన్నారు. ఆమె శరీరంపై ముక్కుపుడక, చేతులకు ఎరుపు రంగు మట్టి గాజులు, కాళ్లకు వెండి పట్టీలున్నాయని తెలిపారు. ఎలాంటి ఆనవాళ్లు చుట్టుపక్కల లభించ లేదన్నారు. ఎవరైనా తమ ఇంటి మహిళ కనిపించకుండా పోయి ఉంటే పోలీసుస్టేషన్ 9121100519 నెంబరుకు తెలియజేయాలన్నారు. కాగా ఈవిషయమై గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు,

సొసైటీ బ్యాంకులో విచారణ



వేంపల్లెలో విచారణ చేస్తున్న అధికారులు

వేంపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలమడుగుపల్లె సహకార బ్యాంకులో అధిక వడ్డీల వసూళ్లపై బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. కత్తలూరుకు చెందిన రైతులు సొసైటీ బ్యాంకులో పొందిన రుణాలకు సంబంధించి వడ్డీని కొంత మొత్తం అదనంగా వసూలు చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. ఈ మేరకు గురువారం కడప డీసీసీ బ్యాంక్ రిజిస్ట్రార్ సత్యా నంద్ ఆధ్వర్యంలో పులివెందుల ఎస్‌డీఎల్‌సీఓ కమలాదేవి విచారణ చేపట్టారు. రైతుల సమక్షంలోనే పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ శరణ్యతో చర్చించారు. సొసైటీ కార్యదర్శి రామిరెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు విచారణ అధికారిణి తెలిపారు.

జర్నలిస్టుల కొత్త అక్రిడిటేషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్లకు (2026-27 సంవత్సరానికి) సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి బి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందన్నారు. మొదటి దశలో పాత్రికేయులు మీడియా రిలేషన్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పేరు, డిసిగ్నేషన్, ఈమెయిల్ అడ్రసు, ఆధార్ నెంబరు, పాస్‌వర్డ్, ఫోన్ నెంబరు నమో దు చేసి ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్త వుతుందన్నారు. రెండో దశలో పాత్రికేయులు ఫోన్ నెంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అప్లోడ్ చేసిన డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్‌లో పొందుపరచి జిరాక్సు కాపీలను, దర ఖాస్తు ప్రతిని జిల్లా పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.
రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన ఈమెయిల్ అడ్రస్, ఫోన్ నెంబరు, పాస్‌వర్డ్ తప్పనిసరిగా గుర్తించుకోవాలన్నారు. జర్నలిస్టులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారిని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉల్లిసాగులో మెలకువలు పాటించండి

- ఉత్పాదకతపై దృష్టిపెట్టండి
- వ్యవసాయశాఖ డిప్యూటీ కమిషనర్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ బ్రహ్మ

దువ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉల్లిసాగులో రైతులు మెలకువలు పాటించినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకు సంబంధించిన డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ తెలిపారు. మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామంలో కేంద్ర బృందం సభ్యులు, ఉద్యానశాఖ అధికారులతో కలిసి గురువారం ఇక్కడ పర్యటించారు. అనంతరం గొల్లపల్లె, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు. పంట ఉత్పత్తి పెరిగేందుకు మెరుగైన పద్ధతులు అవలంభించాలని చెప్పారు. ఎరువుల యాజమాన్యం, ఎత్తు మడుల పద్ధతి, పంట తొలగింపు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులు మైదుకూరులో మార్కెట్‌యార్డు ఏర్పాటు, తద్వారా కొనుగోలు చేయాల్సిన అవసరం, ఇబ్బందుల గురించి అధికారుల దృష్టికి తెచ్చారు. ఇటీవల పంటను పొలాల్లో వదిలేసిన విషయాన్ని తెలియజేసి, అధికారులు తమ గోడు పట్టించుకోవాలని విన్నవించారు. ఉల్లి విత్తనాలను సబ్సిడీతో అందజేయాలని కోరారు. ఉల్లి ఎగుమతి అవసరం గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ వెంకట బృంద సభ్యులు మనోజ్, రాజీవ్‌కుమార్, భార్గవ్, రాష్ట్ర ఉద్యాన కార్యాలయం నుంచి జమదగ్ని, చరవరణ్, ఆశాఖ జిల్లా అధికారి సతీష్, మైదుకూరు హార్టికల్చలర్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

న్యూమోనియాపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో న్యూమోనియా నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ న్యూమోనియాను తటస్థం చేయడానికి సామాజిక అవగాహన కల్పించాలన్నారు. దీంతో పిల్లల్లో న్యూమోనియాను తగ్గించడానికి వీలుంటుందన్నారు. ప్రతి సంవత్సరం నవంబరు 12 నుంచి ఫిబ్రవరి 28 వరకు న్యూమోనియాపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. న్యూమోనియా లక్షణాలు బాల్యదశలోనే గుర్తిస్తాం-పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. న్యూమోనియా లక్షణాలు దగ్గు, జలుబు, ఊపిరి తీసుకోలేక పోవడం ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికా రులు రమణమ్మ, మునిరెడ్డి, రాధాకృష్ణ కుమారి, డాక్టర్లు ఖలీల్, రవిబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టెయిలింగ్ పాండ్ నుంచి కాపాడండి



జనవాణి కార్యక్రమంలో వినతిపత్రం అందిస్తున్న కేకే కొట్టాల ప్రజలు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టెయిలింగ్ పాండ్ నుంచి మా గ్రామాన్ని కాపాడండి అని కేకే కొట్టాల ప్రజలు జనవాణి కార్యక్రమంలో విన్నవించుకున్నారు. గురువారం మంగళ గిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరుగుతున్న జనవాణి కార్యక్రమానికి కేకే కొట్టాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ వల్ల తమ గ్రామానికి జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం అందించారు. వెంటనే తమ గ్రామాన్ని కాపాడాలని వివరించారు. కార్యక్రమంలో కేకే కొట్టాలకు చెందిన శ్రీనాథ్, శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ గాంధీ పార్కు క్యాంటీన్‌లో మాంసాహార విక్రయాలు

- చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు టీడీపీ కౌన్సిలర్ల వినతి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ గాంధీ పార్కు క్యాంటీన్‌లో మాంసాహారం విక్రయాలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ కౌన్సిలర్లు కోరారు. పార్కులో క్యాంటీన్‌ను లీజుకు తీసుకున్న వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా మాంసాహార విక్రయాలు చేపడుతున్నాడని కౌన్సిలర్లు జిలాన్, కమాల్, శివజ్యోతి అభ్యంతరం తెలిపారు. గురువారం కమిషనర్ రవిచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి అతనిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింసావాది మహాత్మాగాంధీ పేరుతో పార్కు ఉంటే... టీ క్యాంటీన్ కోసం తీసుకొని అక్కడ బిర్యానీ హోటల్ నిర్వహణ ఎలా చేపడతారని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ రవిచంద్రారెడ్డి స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

వృద్ధురాలిని బెదిరించి బంగారు గాజులు చోరీ

- కేసు నమోదు చేసిన పోలీసులు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఓ వృద్ధురాలిని బెదిరించి బంగారు గాజులు చోరీ చేసిన సంఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు... పట్టణంలోని మైత్రి లేఅవుట్‌లో విజయ రాఘవరెడ్డి నివాసం ఉంటున్నారు. ఈ నెల 15వ తేదీ తన కుమారుడిని తల్లి వద్ద ఉంచి ఇంట్లోని వారంతా ఓ నిశ్చితార్థ వేడుకకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ పెట్టుకొని వచ్చి తన తల్లిని బెదిరించి చేతికి ఉన్న రెండు బంగారు గాజులను బలవంతంగా తీసుకొని పారిపోయాడని, వీటి విలువ దాదాపు రూ.1.50 లక్షలు ఉంటుందని రాఘవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఎర్రబల్లెలో రూ.1.50 లక్షల విలువైన..

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో దొంగలు పడి బీరువా పగులగొట్టి దాదాపు రూ.1.50లక్షల విలువైన బంగారు నగలను చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఎర్రబల్లె గ్రామంలో బాలగంగిరెడ్డి అనే వ్యక్తి తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మూడు నెలల నుంచి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. 18వ తేదీ ఉదయం 8గంటల సమయంలో ఇంటి వాకిలి తెరిచి ఉందని పక్కింటి వారు బాలగంగిరెడ్డికి ఫోన్ చేసి తెలిపారు. ఆయన భార్య ఇంటికి వచ్చి పరిశీలించగా ఇంటి తాళాలే కాకుండా బీరువాను కూడా పగులగొట్టి అందులో ఉన్న బంగారుహారం, ఉంగరం తీసుకెళ్లినట్లు గుర్తించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గోపవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం మడకలవారిపల్లె సమీపంలో గురువారం మైదుకూరు నుంచి రాజమండ్రి వైపు టమోటా మినీ ఆర్విన్ లారీ, క్రిష్ణపట్నం నుంచి అనంతపురం వెళుతున్న కారు బైపాస్ వద్ద ఢీకొన్నాయి. ఈఘటనలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఢీకొన్న సమయంలో కారు ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని, గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● పట్టించుకోని అధికారులు



ఇసుక అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు... పెన్నా పరివాహక ప్రాంతాల్లో గృహ నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక అని ప్రభుత్వం ఆదేశించినా ఉచితం ముసుగులో ఇసుక దందా కొనసాగిస్తున్నారు ఇసుకాసురులు. ఇంత జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉచితం ముసుగులో పెన్న పరివాహక ప్రాంతాల నుంచి కడపకు ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యంపై పలువురు మండిపడుతున్నారు.

సిద్దవటం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచుపల్లె, కడపాయపల్లె గ్రామాల సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఉచితం ముసుగులో ప్రతిరోజూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్లలో కడపకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం పెన్నా పరివాహక ప్రాంతాల్లో గృహనిర్మాణాలకు మాత్రమే ఆయా గ్రామాల ప్రజలు ఉచితంగా తీసుకెళ్లవచ్చునని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా కొంతమంది అక్రమార్కులు బండికనుమ రహదారిపై ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పొలాల వద్ద గోతులు తీస్తున్నారని, దీని ప్రభావం వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాపై ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజును వివరణ కోరగా గృహావసరాలకు మాత్రమే మండల పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని, కడపకు అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని, బండికనుమ రహదారిపై తనిఖీలు చేపట్టి అక్రమ ఇసుక రవాణా జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

నేడు ప్రజాదర్బార్

రైల్వేకోడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజపురం వద్ద ఉన్న టీడీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు కూటమి సీనియర్ నాయకుడు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. అలాగే సాయంత్రం 4గంటలకు టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మారమ్మకు కార్తీక పూజలు

చిట్వేలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్వేలి బ్రాహ్మణవీధిలో వెలసిన మారమ్మ ఆలయంలో గురువారం కార్తీక అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, మహానైవేద్యం, మంగళహారతి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు మీనాక్షి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కుష్టు వ్యాధి సర్వే తనిఖీ



సర్వే నిర్వహిస్తున్న డాక్టర్ రుబీనా

సుండుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం కుష్టు వ్యాధి సర్వే తనిఖీ చేసినట్లు డాక్టర్ రుబీనా తెలిపారు. ఆశా కార్యకర్త తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి స్పర్శజ్ఞానం లేని వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. అలాంటి సమస్య ఎవరికైనా ఉంటే వారిని రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రానికి పంపించి సమస్యను గుర్తిస్తున్నట్లు తెలిపారు. సర్వే పక్కాగా నిర్వహించి ఆరు నెలల నుంచి 12 నెలలు ఉచితంగా నివారణ మందులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు, సీఐటీయూ నాయకులు



వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

చిట్వేలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా వేతనాలను పెంచక, సమస్యలు పరిష్కరించకపోగా రాత్రి డ్యూటీలు, రీసర్వేలు వంటి అదనపు పనులు చేయించుకుంటూ రెవెన్యూ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మాదిరి పేస్కేలు అమలు చేయాలని, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని, అర్హత ఉన్నవారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు స్పందనారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొరముట్ల సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, గుర్రయ్య, వీఆర్‌ఏల సంఘం మండల నాయకులు సుబ్బరాయుడు, శంకర్, రమణ, నరేష్, మదన్‌మోహన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

సిద్దవటం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు శంకర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచుపల్లె, వెలుగుపల్లె తదితర గ్రామాల్లో కొంతమంది ఎస్సీ, ఎస్టీలకు సొంత గృహాలు కూడా లేవని, అర్హులైనవారిని గుర్తించి ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాచుపల్లె, వెలుగుపల్లె గ్రామాల ఎస్సీ ఎస్టీ కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని పాఠశాల వాహనాలపై చర్యలు తీసుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని పాఠశాలలు, కళాశాలల వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని వాహనాలను నడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలామంది డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేవని, తనిఖీలు చేసే అధికారులు పత్తా లేకుండా ఉన్నారని ఆరోపించారు. అలాగే ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పాలతోటి ప్రసాద్, శెట్టిపల్లె పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లతో సమయం వృథా చేసుకోకూడదు

రామాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పిల్లలు మొబైల్ ఫోన్ చూస్తూ సమయాన్ని వృథా చేసుకోకూడదని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనిజారెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక వెంకటేశ్వర హైస్కూల్‌లో పిల్లలకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రంథాలయ ఉద్యోగి సుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీని మరింత మెరుగుపరుచుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణ డీలర్లు ప్రజలకు నిత్యావసరాల పంపిణీని మరింత మెరుగుపరుచుకోవాలని తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు దుకాణాల వద్ద సూచన బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెన్యూవల్ చేయించుకోలేని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి నిత్యావసర వస్తువులను ప్రజలకు అందేవిధంగా చూడాలన్నారు.

ఆవాస్ యోజనను సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీవో

రాజంపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీవో వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న అర్హులైన ప్రతిఒక్కరికి సొంత స్థలం ఉంటే గృహనిర్మాణం కోసం, స్థలం లేనివారు ఇంటి పట్టా కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 30 లోపుల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెనగలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 2026-27 ఆర్థిక సంవత్సరంలో పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాలు నిర్మించుకునేందుకు అర్హులైనవారు ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ హరిప్రసాద్ తెలిపారు. బార్యాభర్తల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు దరఖాస్తు ఫారానికి జత చేయాల్సి ఉంటుందన్నారు. కొత్తగా రేషన్‌కార్డు తీసుకుని సొంత స్థలంలేని లబ్ధిదారులు ఇంటి స్థలం, గృహం రెండూ మంజూరు చేయాలని కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సొంత స్థలం ఉండి పక్కా గృహాలు కావాలనుకున్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఇంటి నిర్మాణం కోసం..

సుండుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఇంటి నిర్మాణం కోసం పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థలం ఉన్నవారు ఇంటి నిర్మాణం కోసం, స్థలం లేనివారు స్థలం, ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం సచివాలయం పరిధిలో ఈనెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్పర్శ లేని మచ్చలు, పొడలపై అవగాహన

చిట్వేలి నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిట్వేలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం స్పర్శలేని మచ్చలు, పొడలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు అబ్దుల్ అన్సారీ వ్యక్తిగత పరిశుభ్రత, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే మచ్చలు, పొడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తులసి, ఎంపీహెచ్‌వో విజయకుమార్, పీహెచ్ఎన్ విజయకుమారి, ధనలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

పెనగలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం ఎస్టీయూ నూతన కార్యవర్గం గురువారం సాయంత్రం పెనగలూరు ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా జరిగినట్లు ఎస్టీయూ మాజీ అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ తెలిపారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధా న కార్యదర్శిగా రాము, ఆర్థిక కార్యదర్శిగా శివప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.



ఎన్నికైన ఎస్టీయూ నాయకులు

ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందని గురువారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజలకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి గ్రామంలో శుభ్రత, పరిశుభ్రత ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగిరెడ్డి

రైల్వేకోడూరురూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో శుభ్రత, పరిశుభ్రత ఉండాలని ఎంపీడీవో నాగిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయని, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మురికికూపాలు లేకుండా చేయాలన్నారు. చెత్తచెదారాలను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై టీఎన్‌యూఎస్ పోరాటం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై టీఎన్‌యూఎస్ (తెలుగునాడు) నిత్యం పోరాటం చేస్తుందని టీఎన్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య అన్నారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్, జడ్పీ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల పాఠశాల, దిన్నెపాడు, జాండ్రపల్లి ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ మధ్యకాలంలోనే ఒక డీఏ ఇచ్చిందని, మరిన్ని డీఏలు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు, ట్రెజరీ సుధాకర్‌నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పరుచూరు ఆంజనేయులు, సంకా రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పుస్తకాలు జ్ఞానాన్ని పెంపొందిస్తాయి'

రాజంపేట టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంటే జ్ఞానాన్ని పెంపొదిస్తాయని ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. గురువారం 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రఘునాధ్‌రాజు, గ్రంథాలయ అధికారి రవిశంకర్‌రాజు, ఏవో బాలస్వామి, ఫ్యూచర్ మైండ్ పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

వీరబల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వీరబల్లిలోని గ్రంథాలయంలో 58వ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, ఎంఈవో వీరనాగయ్య గురువారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లడం వలన విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ

నందలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులను పంపిణీ చేశారు. నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన ఫౌండేషన్ రాజంపేట కోఆర్డినేటర్ నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఈ పోటీలను నిర్వహించారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా చిన్నకోట్ల శ్రీనివాసులు

గాలివీడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా చిన్నకోట్ల శ్రీనివాసులు ఎంపికయ్యారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో రాష్ట్ర నాయకుడు రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఎస్టీయూ రీజనల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగరాజునాయక్, ఆర్థిక కార్యదర్శిగా నాగరాజు, మైనార్టీ మండల కన్వీనర్‌గా ఇమ్రాన్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీప్రసన్నకుమారి, కుసుమకుమారి, సునీత, సుధాకర్‌నాయక్, శశిధర్‌రెడ్డి, ఖైజర్‌లను ఎన్నుకున్నారు.

అవగాహన కల్పించాలి

రామాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జాషువా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సుస్థిర అభివృద్ధిలో భాగంగా పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

గాలివీడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ఎస్డీజీ), క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులకు పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి



విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో నాగయ్య

రాజంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి నాగయ్య అన్నారు. గురువారం పట్టణంలోని షిర్డీసాయి రెయిన్‌బో హైస్కూల్లో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల పలు విజ్ఞాన ప్రదర్శనలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రఘునాధ్‌రాజు, సుబ్బరాయుడు, స్కూల్ కరస్పాండెంట్ రెడ్డయ్య, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేసన్ ప్రతినిధి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



సీఎం సహాయనిధి పేదలకు వరం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాందని జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. గురువారం మండలంలోని శెట్టిగుంట, వీపీఆర్‌కండ్రిక, రైల్వేకోడూరు టౌన్, వీవీకండ్రిక, శింగిరివారిపల్లె, ఓబనపల్లె, అనంతరాజుపేట గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, పోతురాజు సుమన్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ఉడుం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గంలోని లబ్ధిదారులకు గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సుమారు రూ.12 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి రేపూరి వేణుగోపాల్, రామ్‌నగర్ నరసింహా, పాండురాజు, నాగమునిరెడ్డి, వెంకటేశ్వర్లు, కళాధర్, సుందరేంద్రనాయుడు పాల్గొన్నారు.



రాజంపేటలో చెక్కులను పంపిణీ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఉరేసుకుని చేనేత కార్మికుడు మృతి


మృతి చెందిన చేనేత కార్మికుడు

మదనపల్లె అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మోడెం శ్రీనివాసులు(48) ఉరేసుకుని బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... వీవర్స్ కాలనీ వాసి వెంకటస్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మోడెం సురేంద్ర ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. కాగా అన్నదమ్ములకు ఆరేళ్లగా భూ వివాదం నడుస్తోంది. పలు మార్లు పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పారని, కోర్టులో కేసులు వేసి భూములను బీడుగా ఉంచారు. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చాలా సార్లు ఈ విషయమై ఘర్షణ పడినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు మొదటి భార్య కవితకు ఇద్దరు కుమార్తెలు, రెండో భార్య ఆదిలక్ష్మీకి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆర్థిక వనరులు లేక కుటుంబం జీవనం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 9 గంటలకు మృతుడి అన్న మోడెం సురేంద్ర సీసీ ఫుటేజ్‌లతో కూడిన సాక్ష్యాలతో కేసు పెట్టి లోపల వేయిస్తానని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన మోడెం శ్రీనివాసులు ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పంచతో ఉరేసుకున్నాడు. ఉదయం నిద్రలేచి చూసిన భార్య కవిత కేకలు వేసింది. స్థానికులు వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని మొదటి భార్య కవిత ఫిర్యాదు మేరకు సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- బంగారు, వెండి, కాంస్య పతకాలు సొంతం


బంగారు, కాంస్య, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యకళ మందిర్‌లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వేకోడూరు పట్టణంలోని ఆదర్శ, నారాయణ, విక్టరీ, ఎస్కే స్పోర్ట్స్ అకాడమీలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు కోచ్ ఎస్కే మౌల గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.సుహిత, డి.సుప్రియలు బంగారు పతకాలు సాధించారన్నారు. డి.ధనుష్, టి.జయశంకర్, డి.మధీహ, బి.జయదేవ్‌లు కాంస్య పతకాలు, సులేమాన్, ఈ. చందన, డి.హెవనిక, యం.లేహ్యాలు వెండి పతకాలను సాధించినట్లు వివరించారు. విద్యార్థిని, విద్యార్థులకు తమ అకాడమీలో మంచి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి

రాయచోటిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షలు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఏపీ స్టేట్ బీసీ స్టడీ సర్కిల్ విజయవాడ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ఆర్.నాగేంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని గొల్లపూడిలో గల ఏపీ స్టేట్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిసెంబరు 10 నుంచి జరగనున్న సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం ప్రస్తుతం సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న బీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు డిసెంబరు 5న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఈ టెస్ట్‌లో అర్హత పొందిన వారికి డిసెంబరు 10 నుంచి ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం ఉంటుందని, వివరాలకు 7989819470, 967668175 లను సంప్రదించాలన్నారు.

రసవత్తరంగా అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు


గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు రసవత్తరంగా పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్లో జరిగాయి. ఇందులో బాల బాలికల జట్లు ప్రతిభ కనబర్చినట్లు ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు డాక్టర్ ఎస్‌బాబు, శారద, ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీధర్ తెలిపారు. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న బాలికల జట్లు అనంతపురం, నెల్లూరు, వెస్ట్‌గోదావరి, విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి, కడప, చిత్తూరు, శ్రీకాకుళం, బాలుర జట్లు ఈస్ట్, వెస్ట్ గోదావరి, చిత్తూరు, నెల్లూరు, కర్నూల్, కడప, వైజాగ్, అనంతపురం, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ పాల్, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజా, ఝాన్సీరాణి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేశ్, దిలీప్, కిరణ్, మహేంద్రనాయక్, బాలాజీ, అన్సర్, కమలేశ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే అదాలత్: ఎస్ఈ


వినియోగారుల సమస్యలు వింటున్న ట్రాన్స్‌కో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి

ములకలచెరువు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందిచడమే లక్ష్యమన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. మదనపల్లె పట్టణం, రూరల్, తంబళ్లపల్లె, ములకలచెరువు సబ్ డివిజన్ల వినియోగదారులు రాతపూర్వకంగా అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్ సాంకేతిక సభ్యులు శ్రీనివాసబాబు, ఈఈ గంగాధరం, ఏఈ శేష తదితరులు పాల్గొన్నారు.

పె(పే)ద్దాసుపత్రి

- పారిశుధ్య చర్యలు అంతంత మాత్రమే
- ప్రహరీగోడ నిర్మాణం జరిగేనా ?
- మహిళలు, గర్భిణీలకు సౌకర్యాలు నిల్
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు


రాయచోటి ఏరియా ఆసుపత్రి భవనం

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అది.. లక్షకు పైగా జనాభా కలిగిన జిల్లా కేంద్రం. ఇక్కడ వున్న రాయచోటి ఏరియా ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రి వుండగా, వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. గత ప్రభుత్వంలో నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. ఇక్కడికి రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు కలికిరి, కలకడ, కేవీపల్లి, సుండుపల్లె, వీరబల్లి, గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్‌పీకుంట, చక్రాయపేట తదితర మండలాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. ప్రతిరోజు 800 నుంచి 900 వరకు ఓపీ నడుస్తున్నట్లు ఆసుపత్రి రికార్డులు చెబుతున్నాయి. పేరుకే వంద పడకల ఆసుపత్రి అయినప్పటికీ ఇక్కడ ఆ స్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో నేటికీ ఎమర్జెన్సీ కేసులను కడప, తిరుపతి ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. మెరుగైన కార్పొరేట్ వైద్యం పొందలేని పేదలు ఎందరో రాయచోటి ఏరియా ఆసుపత్రికి వస్తుంటారు. అయితే రోగులు ఆశించినంత స్థాయిలో వైద్య సేవలు లేకపోవడంతో ఇది పెద్దాసుపత్రా ? లేక పేదాసుపత్రా అని ఎద్దేవా చేస్తున్నారు.


ముమ్మరంగా జరుగుతున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు

సమయపాలన పాటించని వైద్యులు

గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాయచోటి పట్టణంలో 50 పడకల ఆసుపత్రిగా ఉన్న సమయంలో వైద్యులు పనితీరు ఎలా ఉందో నేడు జిల్లా కేంద్రం అయినప్పటికీ, వంద పడకల ఆసుపత్రిగా మారినప్పటికీ వైద్యుల సమయపాలనలో మాత్రం ఎటువంటి మార్పు కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ఓపీలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది సెలవులో ఉన్న వైద్యుల పేర్లతో ఓపీ చిటీలను పంపుతూ వారు కూడా విధుల్లో ఉన్నట్లు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కంటి విభాగం వైద్యుడు బదిలీ అయినా ఆ స్థానంలో ఎవరిని నియమించకపోవడంతో ఎంతో మంది కంటి సమస్యతో బాధపడుతున్న రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఆర్థోపెడిక్ సేవలు కూడా పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఇక్కడ ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన చికిత్సల కోసం కడప, తిరుపతి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మహిళలకు ఇంజక్షన్లు, గర్భవతులకు స్కానింగ్ నిర్వహించే ప్రాంతాల్లో కేవలం తాత్కాలిక కర్టన్‌లు ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

శానిటేషన్ అంతంత మాత్రమే

రాయచోటి ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్ సమస్య అంతంత మాత్రంగానే ఉంది. ఆసుపత్రిలో సుమారు పది మందికి పైగా శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఆసుపత్రి ఆవరణంలో పరిశుభ్రత ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు గడ్డి పెరిగిపోయింది. ఆసుపత్రి ఆవరణంలో పలు రోగులు తిరిగే ప్రాంతాల్లో కొన్ని గదుల్లో సరైన శుభ్రత లేకపోవడంతో రాత్రి సమయాల్లో అక్కడే ఉంటున్న రోగులు ఆపరేషన్ అయిన వారు, డెలివరీ అయిన గర్భవతులు తదితరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆసుపత్రికి పడమర భాగంలో ఉన్న పాత ప్రహరీగోడ కూలిపోయి ఏడాది కావస్తున్నా ప్రహరీ గోడ నిర్మాణంలో అటు కాంట్రాక్టర్లు ఇటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో బయట వ్యక్తులతో పాటు పశువులు, కుక్కలు ఆసుపత్రి ఆవరణంలోకి వస్తున్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి కృషి

- డాక్టర్ లక్ష్మీప్రసాద్,
ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటి ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో ఏరియా ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్లు పడమర వైపున ఉన్న పాత గోడ స్థానంలో నూతన ప్రహరీగోడ నిర్మించాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్లు అదనపు భారం పడుతుందన్న కారణంగా ప్రహరీగోడ నిర్మించకుండా వెళ్లిపోయారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా ప్రహరీ గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తాం.

ముమ్మరంగా క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు

ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ భవనం నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాయచోటి ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాల బారిన పడే బాధితులు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో సరైన వైద్యం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయానికి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో క్షతగాత్రుల సౌకర్యార్థం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృషితో రాయచోటి ఏరియా ఆసుపత్రి ఆవరణంలో 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను రూ.23 కోట్లతో వేగంగా చేపడుతున్నారు.


వైద్యుడు రాకపోవడంతో వైద్య సేవల కోసం వేచి ఉన్న రోగులు

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బాలరాజు

- రేపు రాజంపేటలో ప్రమాణ స్వీకారం


సమావేశంలో పాల్గొన్న డాక్టర్‌లు బాలరాజు, సుధాకర్, చెన్నయ్య, ఇతర వైద్యులు

రాజంపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజంపేట పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ బాలరాజు ఎన్నికయ్యారు. ఆయన ఈనెల 22వ తేదీ శనివారం రాజంపేటలోని తిరుమల కన్వెన్షన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు రాజంపేట ఐఎంఏ అసోసియేషన్ సీనియర్ వైద్యులు సుధాకర్, చెన్నయ్య, బాలరాజు తెలిపారు. గురువారం ఐఎంఏ సభాభవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బాలరాజు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రముఖ వైద్యులు హాజరవుతున్నట్లు తెలియజేశారు. రెండు రోజుల పాటు వైద్యులకు, వైజ్ఞానానికి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రజలు ఈ రెండు రోజుల పాటు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు వీరయ్య, విజయ్‌కుమార్, శ్రీహరి, సునీల్, అనిల్, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

రాయచోటిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల భూములకు రక్షణ కవచంగా ఉండే అసైన్డ్ చట్టాన్ని సవరించడం దుర్మార్గకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా అనేక ప్రభుత్వాలు నిరుపేదలకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను మంజూరు చేసిందని, ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా అమ్మడానికి, కొనడానికి వీలు లేకుండా 9/77 అసైన్డ్ చట్టాన్ని తీసుకువచ్చిందని, అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసి విఫలమైందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ రోజు వైసీపీ చర్యలను తప్పుబట్టి ఈ రోజు అసైన్డ్ చట్టాన్ని సవరణ చేసి పేదలు తమ భూములు అతి సునాయాసంగా కోల్పోయే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నెల 10న జరిగిన కేబినెట్ సమావేశంలో చేసిన అసైన్డ్ చట్టసవరణను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న స్థానిక ఎన్జీవో హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు, మేధావులు, అభ్యుదయ వాదులు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి సుధాకర్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని సాహితిని అభినందిస్తున్న ఎస్ఎన్ శ్రీనివాసులు

రైల్వేకోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలకు రైల్వేకోడూరు ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థిని యు.సాహితి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు గురు వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థిని బేస్‌బాల్‌లో మంచి ప్రతిభను కనబరిచిందన్నారు. జనవరి మొదటి వారంలో ఢిల్లీ నిర్వహించే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎస్.వసుంధర, పీఈటీ పుల్లారావు తదితరులు విద్యార్థిని అభినందించారు.

మహిళ అదృశ్యం


రమాదేవి (ఫైల్)

రైల్వేకోడూరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లె గ్రామానికి చెందిన లక్కాకుల రమాదేవి (55) అనే మహిళ ఈ నెల 14న అదృశ్యమైందని ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆమె కోసం భర్త, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొంతకాలంగా ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. భర్త మణి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 9133011204, 9885202864కు సమాచారం అందించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ కోర్సుకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్స్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ కోర్సుకు డిసెంబరు 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి వినీల్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి పరిశ్రమ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఉచిత శిక్షణ ప్రధాన లక్ష్యమన్నారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. ఈనెల 30వ తేదీలోపు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8886297300 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

బద్వేలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిగా వెసులుబాటు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారికి టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారానే జరగాలి : డీపీఓ


వాల్మీకిపురంలో పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

వాల్మీకిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణపంచాయతీలో భాగంగా పన్నుల చెల్లింపులు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె వాల్మీకిపురం పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అధికారులు, సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. గ్రామ పంచాయతీలో బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయని ప్రశ్నిస్తూ ఈ నెల 30 నాటికి వందశాతం వసూళ్లు చేపట్టి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్యం తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సెక్రటరీలకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ఎక్కడా డ్రైనేజీల నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ఇంటి పన్ను చెల్లించవచ్చు


క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

ఒంటిమిట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్‌తో ఇంటి పన్నులు చెల్లించవచ్చని ఎంపీడీవో సుజాతమ్మ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కోడ్ ద్వారా ఇంటి పన్ను, నీటి పన్ను, లైసెన్సు ఫీజులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అలాగే శుక్రవారం ఒంటిమిట్టలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట పంచాయతీ సెక్రటరీ సుధాకర్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర పోటీలకు కన్నెమడుగు విద్యార్థిని


విద్యార్థిని హేమలత

తంబళ్లపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు కన్నెమడుగు హైస్కూల్ విద్యార్థిని హేమలత ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాష తెలిపారు. ఈ నెల 7వ తేదీన మదనపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో హేమలత సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థిని 21, 22 తేదీల్లో మదనపల్లెలో గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. విద్యార్థినిని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసాపేట హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాల, దపేదార్‌పల్లి ఉర్దూ హైస్కూల్, కొత్తపల్లి ఉర్దూ హైస్కూల్లో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించాలనుకుంటున్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షపై సాధ్యాసాధ్యాలను సమీక్షించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు మడితాటి నరసింహారెడ్డి, కొండూరు మురళీమోహన్‌రాజు, వెంకట్రామరాజు, నల్లమల రామాంజులు, వాలూనాయక్, గోవింద నాగరాజు, అమర్‌నాథ్, గౌనిపల్లి రెడ్డెన్న, నాగరాజునాయక్, బలరామరాజు, నరేంద్ర, శివరామరాజు, ఆసీఫ్, వెంకట్రమణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి డైట్ కేంద్రంలో సభ్యత్వ నమోదు చేస్తున్న నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు

ఉద్యాన పంటలకు డ్రిప్

దువ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే నీటి ఆదాతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చిని ఉద్యావన శాఖకు సంబంధించిన అధికారులు సూచిస్తున్నారు. ఇక అంతర పంటల సాగు చేయడం ద్వారా చీడ పీడల నివారణతో పాటు మంచి ఆదాయం లభిస్తుంద ని చెబుతున్నారు. ఈ దిశగా పలువురు రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



పాతదువ్వూరులో తమలపాకు తోటకు ఏర్పాటు చేసిన డ్రిప్

- నీటి ఆదా.. దిగుబడులు అధికం
- అంతర పంటల సాగు లాభదాయకం

దువ్వూరు మండలంలోని మూడిండ్లపల్లె, దువ్వూరు ప్రాంతంలో పసుపు పంట వేసిన కొందరు రైతులు డ్రిప్ ఏర్పాటు చేశారు. దీంతో తోటలు బాగా పెరిగి కళకళలాడుతున్నాయి. డ్రిప్ ద్వారానే తెగుళ్లను అదుపు చేసే కొన్ని కెమికల్స్‌తోపాటు సత్తువలను పంపుతున్నారు. మొక్కలకు నేరుగా ఇవి అందడంతో ప్రయోజనకరంగా ఉందని సంబంధిత రైతులు చెబుతున్నారు. మండలంలో ఈ తరహా డ్రిప్ ఏర్పాటుతో ఈశ్వర్‌రెడ్డి, షబ్బీర్ అనే రైతులు సాగు చేసిన

డ్రిప్ ఎంతో ఉపయోగకరం

ఉద్యాన వనశాఖకు సంబంధించిన పంటలకు డ్రిప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ద్వారా నీరు ఆదా అవుతుంది. ఎరువు మొక్కకు నేరుగా అందుతుంది. పసుపులో దుంపకుళ్ల రాకుండా తోడ్పడుతుంది. తమలపాకు తోటల్లో దిగుబడి పెరుగుతుంది. పసుపులో అంతర పంటగా బొప్పాయి సాగు చేస్తే తెగుళ్ల అదుపులో ఉండడంతోపాటు మంచి ఫలితాలు అందుతాయి.

\- సి.రామకృష్ణ, ఉద్యానవనశాఖ అధికారి, మైదుకూరు.

పసుపు తోటలు కళకళలాడుతున్నాయి. అలాగే పసుపులో అంతర్ పంటగా బొప్పాయి వేశారు. ఈ తోటలు ఆశాజనకంగా కనపడుతున్నాయి. బొప్పాయి కాపునకు వస్తే మంచి ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. దీంతోపాటు పాత దువ్వూరు, రాంసాయి నగర్, మూడిండ్లపల్లె ప్రాంతాల్లో రామకృష్ణ, చలపతి, వెంకటేశ్వర రెడ్డి అనే రైతులు తమలపాకు తోటలకు డ్రిప్ పద్ధతి అవలంబిస్తున్నారు. తోటల్లో ఆకులు విరగ కాస్తున్నాయి. డ్రిప్ ఏర్పాటుకు ఉద్యానవన శాఖ ద్వారా పెద్ద మొత్తంలో సబ్సిడీ అందజేస్తుండడం విశేషం.



పసుపులో అంతర పంటగా సాగు చేసిన బొప్పాయి


డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డీబార్



పరీక్షలను తనిఖీ చేస్తున్న కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలను హైపర్ కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు కేంద్రాలలో ముగ్గురు విద్యార్థులను డీబార్ చేశారు. గురువారం ఉమ్మడి కడప జిల్లా వైవీయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు, హైపవర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ రియాజున్నీసా నుండుపల్లెలోని వీరభద్ర డిగ్రీ కళాశాలలో ఒకరిని డీబార్ చేయగా, పుల్లారెడ్డిపేట ఎస్ఎల్ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరిని ప్రొఫెసర్ కట్టా వెంకటేశ్వర్లు డీబార్ చేశారు. ఈ సందర్భంగా సీఈ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలలో 16887 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలకు అబ్జర్వర్లను పంపామని, హైపర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారన్నారు.

గండికోటను సందర్శించిన ఎమ్మెల్యేల కమిటీ



గండికోట లోయ వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

జమ్మలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పబ్లిక్ అండర్ టేకింగ్ ఎమ్మెల్యేల కమిటీ సందర్శించింది. గురువారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, వర్ల కుమార్‌రాజా, ఆర్‌వీఎస్ కేకే, రంగారావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలు గండికోటను సందర్శించారు. వారి వెంట ఆర్డీవో సాయిశ్రీ, టూరిజం డివిజనల్ మేనేజర్ మల్లికార్జునగౌడ్, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి సిబ్బంది ఉన్నారు. మొదట రంగనాథ స్వామి దేవాలయం నుంచి లోయ వరకు వెళ్లి పరిశీలించారు. అక్కడి నుంచి ధాన్యాగారం వరకు వచ్చి చుట్టూ పరిసరాలు పరిశీలించారు. అలాగే హరిత హోటల్ సందర్శించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



పర్వీన్ మృతదేహం

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీయూ క్వార్టర్స్‌లో పర్వీన్ (32) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... పర్వీన్ ఆమె భర్త టిప్పు సుల్తాన్ ఇరువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పర్వీన్ తన భర్తతో మనస్పర్థల కారణంగా బుధవారం హైదరాబాద్ నుంచి పులివెందుల జేఎన్టీయూ క్వార్టర్స్‌లో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. గురువారం మధ్యాహ్నం పర్వీన్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఉల్లిసాగులో మెలకువలు పాటించండి

- ఉత్పాదకతపై దృష్టిపెట్టండి
- వ్యవసాయశాఖ డిప్యూటీ కమిషనర్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ బ్రహ్మ

దువ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉల్లిసాగులో రైతులు మెలకువలు పాటించినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకు సంబంధించిన డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ తెలిపారు. మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామంలో కేంద్ర బృందం సభ్యులు, ఉద్యానశాఖ అధికారులతో కలిసి గురువారం ఇక్కడ పర్యటించారు. అనంతరం గొల్లపల్లె, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు. పంట ఉత్పత్తి పెరిగేందుకు మెరుగైన పద్ధతులు అవలంబించాలని చెప్పారు. ఎరువుల యాజమాన్యం, ఎత్తు మడుల పద్ధతి, పంట తొలగింపు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులు మైదుకూరులో మార్కెట్‌యార్డు ఏర్పాటు, తద్వారా కొనుగోలు చేయాల్సిన అవసరం, ఇబ్బందుల గురించి అధికారుల దృష్టికి తెచ్చారు. ఇటీవల పంటను పొలాల్లో వదిలేసిన విషయాన్ని తెలియజేసి, అధికారులు తమ గోడు పట్టించుకోవాలని విన్నవించారు. ఉల్లి విత్తనాలను సబ్సిడీతో అందజేయాలని కోరారు. ఉల్లి ఎగుమతి అవసరం గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ వెంకట బృంద సభ్యులు మనోజ్, రాజీవ్‌కుమార్, భార్గవ్, రాష్ట్ర ఉద్యాన కార్యాలయం నుంచి జమదగ్ని, చరవరణ్, ఆశాఖ జిల్లా అధికారి సతీష్, మైదుకూరు హార్టికల్చర్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

APS RTC

టెండరు ప్రకటన

అన్నమయ్య జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు ఆసక్తి కలిగిన వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.24-11-2025 నుండి తేది.08-12-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.09-12-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, రాయచోటి నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://www.apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఏదైనా కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం.P1/797(04)/2025-DPTO/ANM, తేది:18-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం



మహిళ ఒంటిపై లభ్యమైన వస్తువులు

చెన్నూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇర్కాన్ సర్కిల్ సమీపంలో కేసీ కెనాల్ బ్రిడ్జి కింద సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని మహిళ శవం గుర్తించినట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఈ మహిళ చనిపోయి దాదాపు మూడు వారాలకుపైగా అయి ఉంటుందని, శరీరం గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉబ్బిపోయి ఉందన్నారు. ఆమె శరీరంపై ముక్కుపుడక, చేతులకు ఎరుపు రంగు మట్టి గాజులు, కాళ్లకు వెండి పట్టీలున్నాయని తెలిపారు. ఎలాంటి ఆనవాళ్లు చుట్టుపక్కల లభించ లేదన్నారు. ఎవరైనా తమ ఇంటి మహిళ కనిపించకుండా పోయి ఉంటే పోలీసుస్టేషన్ 9121100519 నెంబరుకు తెలియజేయాలన్నారు. కాగా ఈవిషయమై గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు,

న్యూమోనియాపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో న్యూమోనియా నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ న్యూమోనియాను తటస్థం చేయడానికి సామాజిక అవగాహన కల్పించాలన్నారు. దీంతో పిల్లల్లో న్యూమోనియాను తగ్గించడానికి వీలుంటుందన్నారు. ప్రతి సంవత్సరం నవంబరు 12 నుంచి ఫిబ్రవరి 28 వరకు న్యూమోనియాపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. న్యూమోనియా లక్షణాలు బాల్యదశలోనే గుర్తిస్తాం-పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. న్యూమోనియా లక్షణాలు దగ్గు, జలుబు, ఊపిరి తీసుకోలేక పోవడం ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రమణమ్మ, మునిరెడ్డి, రాధాకృష్ణ కుమారి, డాక్టర్లు ఖలీల్, రవిబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

e-procurement tender notice

Rajampet Municipality

S. No.	'e'-Procurement Notice No.	Number of Works	Estimate Contrat Value (in Lakhs)
	55/15th FC/DEE/AE/2025-26 & 56/GF/DEE/AE/2025-26 to 59/GF/DEE/AE/2025-26	5	29.00
	Bid document download start date	21-11-2025, 10.00 AM	
	Bid document download end date	05-12-2025, 3.00 PM	
	Last Date of receipt of Tender	05-12-2025, 3.30 PM	

Furter details can be seen @ 'e' - Procurement Market Place in https://tender.apeprocurement.gov.in/,Contract No. 99890 51971

Commissioner
Rajampet Municipality

సొసైటీ బ్యాంకులో విచారణ



వేంపల్లెలో విచారణ చేస్తున్న అధికారులు

వేంపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలమడుగుపల్లె సహకార బ్యాంకులో అధిక వడ్డీల వసూళ్లపై బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. కత్తలూరుకు చెందిన రైతులు సొసైటీ బ్యాంకులో పొందిన రుణాలకు సంబంధించి వడ్డీని కొంత మొత్తం అదనంగా వసూలు చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. ఈ మేరకు గురువారం కడప డీసీసీ బ్యాంక్ రిజిస్ట్రార్ సత్యా నంద్ ఆధ్వర్యంలో పులివెందుల ఎస్‌డీఎల్‌సీఓ కమలాదేవి విచారణ చేపట్టారు. రైతుల సమక్షంలోనే పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ శరణ్యతో చర్చించారు. సొసైటీ కార్యదర్శి రామిరెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు విచారణ అధికారిణి తెలిపారు.

జర్నలిస్టుల కొత్త అక్రిడిటేషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్లకు (2026-27 సంవత్సరానికి) సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి బి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందన్నారు. మొదటి దశలో పాత్రికేయులు మీడియా రిలేషన్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పేరు, డిసిగ్నేషన్, ఈమెయిల్ అడ్రసు, ఆధార్ నెంబరు, పాస్‌వర్డ్, ఫోన్ నెంబరు నమో దు చేసి ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్త వుతుందన్నారు. రెండో దశలో పాత్రికేయులు ఫోన్ నెంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అప్లోడ్ చేసిన డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్‌లో పొందుపరచి జిరాక్సు కాపీలను, దర ఖాస్తు ప్రతిని జిల్లా పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన ఈమెయిల్ అడ్రస్, ఫోన్ నెంబరు, పాస్‌వర్డ్ తప్పనిసరిగా గుర్తించుకోవాలన్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారిని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టెయిలింగ్ పాండ్ నుంచి కాపాడండి



జనవాణి కార్యక్రమంలో వినతిపత్రం అందిస్తున్న కేకే కొట్టాల ప్రజలు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టెయిలింగ్ పాండ్ నుంచి మా గ్రామాన్ని కాపాడండి అని కేకే కొట్టాల ప్రజలు జనవాణి కార్యక్రమంలో విన్నవించుకున్నారు. గురువారం మంగళ గిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరుగుతున్న జనవాణి కార్యక్రమానికి కేకే కొట్టాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ వల్ల తమ గ్రామానికి జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం అందించారు. వెంటనే తమ గ్రామాన్ని కాపాడాలని వివరించారు. కార్యక్రమంలో కేకే కొట్టాలకు చెందిన శ్రీనాథ్, శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ గాంధీ పార్కు క్యాంటీన్‌లో మాంసాహార విక్రయాలు

- చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు టీడీపీ కౌన్సిలర్ల వినతి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ గాంధీ పార్కు క్యాంటీన్‌లో మాంసాహారం విక్రయాలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ కౌన్సిలర్లు కోరారు. పార్కులో క్యాంటీన్‌ను లీజుకు తీసుకున్న వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా మాంసాహార విక్రయాలు చేపడుతున్నాడని కౌన్సిలర్లు జిలాన్, కమాల్, శివజ్యోతి అభ్యంతరం తెలిపారు. గురువారం కమిషనర్ రవిచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి అతనిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింసావాది మహాత్మాగాంధీ పేరుతో పార్కు ఉంటే... టీ క్యాంటీన్ కోసం తీసుకొని అక్కడ బిర్యానీ హోటల్ నిర్వహణ ఎలా చేపడతారని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ రవిచంద్రారెడ్డి స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

వృద్ధురాలిని బెదిరించి బంగారు గాజులు చోరీ

- కేసు నమోదు చేసిన పోలీసులు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఓ వృద్ధురాలిని బెదిరించి బంగారు గాజులు చోరీ చేసిన సంఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు... పట్టణంలోని మైత్రి లేఅవుట్‌లో విజయ రాఘవరెడ్డి నివాసం ఉంటున్నారు. ఈ నెల 15వ తేదీ తన కుమారుడిని తల్లి వద్ద ఉంచి ఇంట్లోని వారంతా ఓ నిశ్చితార్థ వేడుకకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ పెట్టుకొని వచ్చి తన తల్లిని బెదిరించి చేతికి ఉన్న రెండు బంగారు గాజులను బలవంతంగా తీసుకొని పారిపోయాడని, వీటి విలువ దాదాపు రూ.1.50 లక్షలు ఉంటుందని రాఘవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఎర్రబల్లెలో రూ.1.50 లక్షల విలువైన..

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో దొంగలు పడి బీరువా పగులగొట్టి దాదాపు రూ.1.50లక్షల విలువైన బంగారు నగలను చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఎర్రబల్లె గ్రామంలో బాలగంగిరెడ్డి అనే వ్యక్తి తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మూడు నెలల నుంచి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. 18వ తేదీ ఉదయం 8గంటల సమయంలో ఇంటి వాకిలి తెరిచి ఉందని పక్కింటి వారు బాలగంగిరెడ్డికి ఫోన్ చేసి తెలిపారు. ఆయన భార్య ఇంటికి వచ్చి పరిశీలించగా ఇంటి తాళాలే కాకుండా బీరువాను కూడా పగులగొట్టి అందులో ఉన్న బంగారుహారం, ఉంగరం తీసుకెళ్లినట్లు గుర్తించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గోపవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం మడకలవారిపల్లె సమీపంలో గురువారం మైదుకూరు నుంచి రాజమండ్రి వైపు టమోటా మినీ ఆల్విన్ లారీ, క్రిష్ణపట్నం నుంచి అనంతపురం వెళుతున్న కారు బైపాస్ వద్ద ఢీకొన్నాయి. ఈఘటనలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఢీకొన్న సమయంలో కారు ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని, గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

చదువుతోనే సంస్కారం, అవగాహన

వేడుకగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు ● బాలల హక్కుల్లో చదువు కూడా ఒకటి ● విజేతలకు బహుమతులు అందజేత







బాలలహక్కుల వారోత్సవాల ముగింపులో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి - వాల్మీకిపురంలో బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ అధికారి రమాపతి - కలకడలో మహాభారతం పుస్తకాలను అందజేస్తున్న లోకా జగన్నాథశాస్త్రి

మదనపల్లె టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోనే సంస్కారం, చట్టాలపై అవగాహన వస్తుందని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం సౌకర్యాలు, సదుపాయాలు కల్పించడం బాలల హక్కుల్లో ఒక భాగమే అన్నారు. ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ బాలలకు ప్రభుత్వం కల్పించిన హక్కులపై పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. ఐక్యరాజ్యసమితిలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు తీర్మానించారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి అతిథుల చేత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బరోడా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి, హెచ్‌ఎం శంకర్, ఏఐఎస్ఎఫ్ ఉత్తన్న, ఫోర్డు సుభాషిణి, నిర్మల పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. లైబ్రేరియన్ జిలానీ బాష, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్ ఎంసీ చైర్మన్ శివకుమార్, ఉపాధ్యాయులు రెడ్డప్పరెడ్డి, పద్మావతి, సుగుణమ్మ, హేమలత, వెంకట్రమణ, షాజిదాబేగం, గౌసియా, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో....

వాల్మీకిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. వాల్మీకిపురం గ్రంథాలయంలో వక్తలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకుని ముందుకు సాగితే మంచి భవిష్యత్తు చేకూరుతుందన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారి పసు పులేటి రమాపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను బలోపేతం చేయాలి

కలకడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను బలోపేతం చేయాలని తెలుగు ఉపాధ్యాయులు లోకా జగన్నాథశాస్త్రి అన్నారు. బాటవారిపల్లి జడ్పీ హైస్కూల్లో జరిగిన గ్రంథాలయ వారోత్సవ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు కృషి ఫలితంగా నేడు ఊరురా గ్రంథాలయాలు వెలసినట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయ పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. రూ. 5వేలు విలువైన పిలకా గణపతిశాస్త్రి వచన రూపంలో సరళంగా రచించిన మహాభారతం హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, పాఠశాల గ్రంథాలయ ఇన్‌చార్జ్ బాబురెడ్డికి అందజేశారు. తన రచనలు ముకుందమాల పద్యానువాదగ్రంథం, గౌరీశతకం పుస్తకాలను మండలంలోని పాఠశాలల గ్రంథాలయాలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అమర్ నాథ్, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు తోడ్పాటు

కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నిరుద్యోగుల లక్ష్య సాధన కోసం గ్రంథాలయాలు తోడ్పాటునందిస్తాయని ఎంపీడీఓ భానుమూర్తి రావు తెలిపారు. గ్రంథాలయాలు జ్ఞానాన్ని ప్రసాదించే కల్పతరువుగా భావించాలన్నారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం అలవాటైతే క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో వుంచేందుకు బహాకరిస్తానన్నారు. ప్రముఖ కవి అబ్దుల్ ఖాదర్, డిప్యూటీ ఎంపీడీఓ మహ్మద్ రియాజుద్దీన్, ఏఓ సురేంద్ర బాబు, గ్రంథాలయాధికారి విజయకుమార్, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన

గుర్రంకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలతో జ్ఞానసముపార్జన జరుగుతుందని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రెడ్డికుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంపై ప్రత్యేక చొరవ చూపాలి : సీడీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజమ్మ

పీలేరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు చొరవ చూపాలని సీడీపీఓ రాజమ్మ సూచించారు. గురువారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో... బేటీ పడావోలో ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ఇటీవల బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీంతో జీవితంలో అనేక ఆటుపోట్లు, ఇబ్బందులను ఎదుర్కోక తప్పడం లేదన్నారు. బిడ్డల ఉజ్వల భవిత కోసం బాల్య వివాహాలకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈఓ పద్మావతి మాట్లాడుతూ బాలికల విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులను కోరారు. తలపుల పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా శిశు గృహ మేనేజర్ సుప్రియ, సోషల్ వర్కర్ లావణ్య, ఎంపీడీఓ శివశంకర్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. అంతర్జాతీయ దత్తత మాసోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు.

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి : ఎమ్మెల్యే



రైతు ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష తదితరులు

నిమ్మనపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. గురువారం స్థానిక తవళం రోడ్డులో వున్న రైతు ఉత్పత్తి సేవా కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు తక్కువ ధరకే ఆర్ఎన్ఆర్ బ్రాండ్ వరి విత్తనాలను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ 1392 మంది రైతులు వాటాదారులుగా ఏర్పడి స్వచ్ఛందంగా రైతు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి తక్కువ ధరకే ఎరువులు అదించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కేంద్రంలో రైతులకు 374 రకాల ఎరువులు, విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పద్ధతి మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తా

రెవెన్యూ సిబ్బందిపై మామూళ్లు తీసుకుని పనులు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని మానుకోక పోతే సస్పెండ్‌కు ఆదేశిస్తామని హెచ్చరించారు. పేద రైతులు కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి సరైన సమాధానం చెప్పి పనులు చేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, మండల అధ్యక్షుడు వెంకటరమణ, రైతు ఉత్పత్తి కేంద్రం అధ్యక్షుడు శంకరరెడ్డి, నేతలు మునిరత్నం, రాజన్న, రషి, శ్రీపతి, రమణ, మల్లప్ప, విజయ్, దేవేంద్ర, లక్ష్మన్న పాల్గొన్నారు.

‘బాస్’ ఆవిర్భావ వేడుకలు ప్రారంభం



వేడుకలను ప్రారంభిస్తున్న బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) 14వ ఆవిర్భావ దినోత్సవం గురువారం బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ ప్రాంగణం వద్ద ప్రారంభమయ్యాయి. బాస్ జాతీయ కన్వీనర్ పీటీఎం శివప్రసాద్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఉలగనాథన్ గణపతి కలిసి జెండాను ఎగురవేశారు. అనంతరం బాస్ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జాతీయ కన్వీనర్ మాట్లాడుతూ 2012 డిసెంబరు 20న భారతీయ అంబేడ్కర్ సేన ఆవిర్భవించిందన్నారు. నవంబరు 20 నుంచి డిసెంబరు 20వ తేదీ వరకూ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 20, 21వ తేదీల్లో విజయవాడలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కె.వి.రమణ, యు.గణపతి, వి.దొరస్వామి, నీరుగట్టి రమణ, ముత్యాల మోహన్, బాలకృష్ణ, జి.వి.రమణ, ఎస్.రెడ్డెప్ప, వై.గంగాధర్, కృష్ణ, క్రాంతి, జి.గంగులప్ప, శశిధర్, ఇర్ఫాన్, రెడ్డెప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకర్

పీలేరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తామని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. గురువారం పీలేరు ఎమ్మార్సీ కార్యాలయంలో పచ్చదనం- పరిశుభ్రతపై సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల సదస్సులో ఆయన మాట్లాడుతూ జనవాసాలు నడుమ పారిశుధ్యం కొరవడితే జనం రోగాలు బారిపన పడతారని హెచ్చరించారు. రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు వద్ద ఎప్పటి కప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ యుగంధర్, ఈఓ బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరసింహుడు

ములకలచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ నరసింహుడు సూచించారు. స్థానిక బస్‌స్టాండ్ సర్కిల్‌లో గురువారం రాత్రి ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్యాసింజర్లను తరలించరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గర్భ కోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్య సంచాలకులు డాక్టర్ సుమిత్ర సూచించారు. గురువారం దండువారిపల్లెలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గర్భకోశ వ్యాధుల్లో నిష్ణాతులైన సహాయ సంచాలకులు డాక్టర్ కళ్యాణ్‌వెంకటేష్ 36 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. 95 పశువులకు బూటాక్స్ పిచికారీ, 46 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. అనంతరం పాడి రైతులకు గర్భకోశ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. వైద్య శిబిరంలో మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, వైద్యులు ఇందు, జేవీఓలు శ్రీనాథ్, హేమాపతిరెడ్డి, పశువైద్య సహాయకులు శ్రీనివాసపరెడ్డి, శిరీష, దేవేంద్ర, పూర్ణిమ, రమేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట’



సమావేశంలో మాట్లాడుతున్న దినేశ్

పీలేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ కార్యదర్శి, పీలేరు ఏఎంసీ డైరెక్టర్ కలప రవి అన్నారు. గురువారం పీలేరులో వారు మాట్లాడుతూ ఏడాదిన్నరలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రైతులకు రెండు విడతల్లో రూ. 14 వేలు ఇవ్వడంతో రైతుల కళ్లలో ఆనందం కనిస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగం బలోపేతం చేయడం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని వివరించారు. సమావేశంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, కార్యదర్శి రాజేష్, గాలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, నీటి సరఫరాపై శ్రద్ధ వహించాలి



ఆర్‌జీఎస్ఏ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచులు

రామసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మంచినీటి సరఫరాపై శ్రద్ధ చూపి 15వ ఫైనాన్స్ నిధులు సింహభాగం వీటిపైనే ఖర్చు చేయాలని ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సర్పంచుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా అడుగులు వేయాలని సర్పంచులను కోరారు. శుక్ర, శనివారాల్లో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందికి ఆర్‌జీఎస్ఏ వార్షిక ప్రణాళికపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ సర్పంచ్‌లతో కలిసి ఆర్‌జీఎస్ఏ వార్షిక ప్రణాళిక బ్యానర్‌ను ఆవిష్కరించారు.

మద్దినాయనిపల్లెలో స్వామిత్వ గ్రామసభ

ములకలచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్దినాయనిపల్లె సచివాలయం ఆవరణలో గురువారం స్వామిత్వ గ్రామసభ జరిగింది. రాష్ట్ర రీసర్వే ప్రాజెక్టు కింద సర్వే, మ్యాపింగ్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ మోహనప్రతాప్ మాట్లాడుతూ గ్రామ సర్వే, మ్యాపింగ్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి మద్దే సుధాకర్ నాయుడు, సర్పంచ్ కృష్ణమూర్తి, నేతలు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై సర్పంచులకు శిక్షణ



సర్పంచుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్

పెద్దతిప్పసముద్రం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతులపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ శిక్షణా తరగతు లను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధిని చేసుకోవాలన్నారు. శిక్షణకు సచివా లయ పరిధిలో పని చేసే గ్రీన్ అంబాసీడర్లు, వెలుగు సంఘ సభ్యులు వీఏఓలు పాల్గొనాలన్నారు. ఈశిక్షణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శు లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాలు అభివృద్ధి సాధించాలి

పెద్దమండ్యం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి సాధనకు సమష్టి కృషి చేయాలని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు పిలుపు నిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్పంచులు, కార్యదర్శుల శిక్షణలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వంద శాతం ఆన్‌లైన్ పన్ను చెల్లించాలన్నారు. ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరారు. డంపింగ్ యార్డ్‌లను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి నిధులు గ్రామాల అభివృద్ధి పనులకు సకాలంలో వినియోగించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ విమలకుమారి, కార్యదర్శులు జనార్థన్, శైలజ, జగన్, సుబ్రమణ్యం, ఖాదర్‌బాష, లక్ష్మీప్రసన్న, మంజుభార్గవి, బాలాజీ, గిరిష్, మమ్మద్, పద్మానాభం, భూపతి, సద్దాంహుసేన్, సురేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, పచ్చదనం కోసం కృషి చేయాలి

కలకడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అందరూ కలిసి గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనంకు కృషి చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. ఆర్‌జీఎస్ఎ వార్షిక కార్యచరణ ప్రణాళిక శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రజా ప్రతినిధులు తమవంతు సహకరించాలన్నారు. పారిశుధ్యం మెరుగు, తదితర పనుల గురించి అవగహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల కోసమే సహకార సొసైటీ



జెండా ఆవిష్కరిస్తున్న రఘునాథరెడ్డి

మదనపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసమే సహకార సొసైటీలు, సింగిల్‌విండోలని, వాటి అభివృద్ధికి రైతులు సహకరించాలని మదనపల్లె ప్యాక్స్ పర్సన్ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక సింగిల్‌విండోలో గురువారం సహకార వారోత్సవాలు ముగింపు సందర్భంగా రైతులతో సమావేశమైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతు బ్యాంకులుగా పేరొందిన సింగిల్‌విండో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట, వ్యాపారం, బంగారం, భూముల అభివృద్ధి కోసం రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సీఈఓ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యఘర్ పథకం కింద యూనిట్ మంజూరు చేస్తామన్నారు. నలుగురు రైతులు సంఘం ఏర్పడి పంటలకు పిచికారీ చేసే డ్రోన్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ.10లక్షల విలువైన పరికరాలు మంజూరు చేస్తామని సీఈఓ అన్నారు. అనంతరం సహకార వారోత్సవాలు ముగింపు సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆడిటర్ రెడ్డెప్ప, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రాలే గ్రంథాలయాలు



సమావేశంలో మాట్లాడుతున్న మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జ్ఞానాన్ని అందించే విజ్ఞాన కేంద్రాలే గ్రంథాలయాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాల కృష్ణ అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో అధికారి వసంతకుమారి ఆధ్వర్యంలో జాతీయ వారోత్సవాలు ముగించారు. మరసం ప్రధాన కార్యదర్శి యుగంధరాచారి, బీటీ కళాశాల కరస్పాండెంట్ ఐఎస్‌మునిరత్నం, బరోడా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజరు కోటిరెడ్డి, హరినాధరెడ్డి, కవయిత్రి సురభి హేమలత, విశ్వహిత డిగ్రీ కళాశాల అధ్యాపకులు ముస్తాద్, విశ్రాంతి లెక్చరర్ రెడ్డెప్ప, జీఆర్టీ హైస్కూల్ కో- ఆర్డినేటర్ జగన్మోహన్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం



అన్నాభిషేకం చేస్తున్న పండితుడు

వాల్మీకిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. గురువారం కార్తీక అమావాస్య సందర్భంగా ఆలయంలోని లింగోద్భవ మహాశివుడికి ఏకవార, రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించి హోమాది కార్యక్రమాల అనంతరం విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేపట్టారు. ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి చేయూత

మదనపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బసినికొండ రింగురోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ఆలయానికి టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి చేయూతనిచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని నిర్వాహకులు కోరడంతో తనవంతు సాయంగా బసినికొండ గంగన్నగారిపల్లె వాసి బాబురెడ్డి రూ.10,116 అందజేశారు.

ఫీజుల పేరుతో దోపిడీ

మదనపల్లె టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పరీక్ష ఫీజుల పేరుతో విద్యార్థులను దోపిడీ చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ఆరోపించారు. టెన్త్ క్లాస్‌కు రూ.125 మాత్రమే పరీక్ష ఫీజు వసూలు చేయాలని నిబంధన పెడితే కొన్ని ప్రైవేటు పాఠశాలలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 వసూలు చేస్తున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే విద్యాశాఖ అధికారులకు కొంత సొమ్ము ఇవ్వాల్సి వుంటుందని ప్రైవేటు పాఠశాలల యజమానులు చెబుతున్నారన్నారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టిపెట్టి విచారించి, విద్యార్థులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికులకు వస్త్రాలు పంపిణీ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చలపతి

మదనపల్లె అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, హెల్మెట్స్ పంపిణీ చేశారు. బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కుమార్ జన్మదిన వేడుకల నంతరం అన్నదానం చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద బహుజన యువసేన సంబరాలు చేసుకున్నారు. బీవైఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజేఆర్‌లో సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ వీణా గ్రేస్

పీలేరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ఐబీఎం సంస్థ అసోసియేట్ ప్రొఫెసర్ వీణా గ్రేస్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో, ఉద్యోగ జీవితంలో గానీ సాఫ్ట్ స్కిల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వ్యక్తిగత నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సర్దుబాటు చేయగల సామర్థ్యాలు, వివాదాల నిర్వహణ సామర్థ్యాలు పెంపొందించుకోవడానికి అవలంబించాల్సిన పద్ధతులపై వివరించారు. కళాశాల చైర్మన్ ఎం.పి.అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రథములుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సాఫ్ట్ స్కిల్స్‌పై కూడా అవగాహన, శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డా.కేవీఎస్‌వీ నరసింహారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.